




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 251, పేజీలు - 08

బుధవారం, ఫిబ్రవరి 25, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## హైదరాబాద్‌లో పట్టు సాధించేందుకు

# రేవంత్ మాస్టర్ ప్లాన్

### - ఎన్నికలకు ముందే ఇలా చేయబోతున్నారా?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 1500కు పైగా వార్డులను కైవసం చేసుకుంది. 90 శాతానికి పైగా మున్సిపాలిటీలలో అధికార పార్టీ జెండా ఎగురవేయగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ కేవలం 772 వార్డులకే పరిమితమైంది. పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ పథకాలు, రేవంత్ రెడ్డి పాలనపై ప్రజలు నమ్మకం ఉంచారని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అందుకే హైదరాబాద్ లో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు కార్పొరేషన్లలో గెలవడానికి ప్లాన్ చేసుకుంటున్నారు.

**భారీగా పట్టు కోల్పోయిన బీఆర్ఎస్**

దశాబ్ద కాలంగా పట్టణ ఓటర్లపై తిరుగులేని పట్టున్న బీఆర్ఎస్ ఈసారి భారీగా నష్టపోయింది. 90 శాతం మున్సిపల్ కౌన్సిళ్లపై నియంత్రణ కోల్పోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల కంటే, ప్రస్తుత ప్రభుత్వ గ్యారంటీ లకే ప్రజలు ఆకర్షితులయ్యారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారింది. పార్టీ అంతర్గత విభేదాలు, బలమైన క్షేత్రస్థాయి సమన్వయం లోపించడం కూడా ఈ ఓటమికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

**మూడు కార్పొరేషన్లపై రేవంత్ మాస్టర్ ప్లాన్**

మున్సిపల్ ఫలితాల ఊపుతో రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు జీహెచ్ఎంసీపై దృష్టి సారించింది. 2026 చివరలో లేదా 2027 ప్రారంభంలో జరగనున్న గ్రేటర్ ఎన్నికల కోసం ప్రభుత్వం భారీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ పరిధిని

2లో..

## ప్రధాని తన ఇమేజ్ కోసమే

# ఒత్తిడికి తలొగ్గారు

### - మోదీ పై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కోసం ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, అమెరికా ఒత్తిడికి పూర్తిగా లొంగిపోయారని ఆయన ఆరోపించారు. మంగళవారం భోపాల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'మహా కిసాన్ సమ్మేళన్'లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో భారత్ అమెరికా నుంచి రూ.9 లక్షల కోట్ల విలువైన వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీనివల్ల దేశీయ పరిశ్రమలు, ముఖ్యంగా వ్యవసాయ, టెక్స్‌టైల్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "టెక్స్‌టైల్ రంగాన్ని ఇప్పటికే నాశనం చేశారు. బంగ్లాదేశ్‌కు సున్నా శాతం సుంకాలు ఇచ్చిన అమెరికా, తమ నుంచి పత్తి కొనాలంటూ భారత్‌పై ఒత్తిడి తెస్తోంది" అని రాహుల్ విమర్శించారు. "తన రాజకీయ భవిష్యత్తును, వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకోవడానికే నరేంద్ర మోదీజీ ఒత్తిడికి తలొగ్గారు" అని రాహుల్ ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రధానిని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి ఈమెయిళ్లు, వీడియోలతో సహా కీలక ఆధారాలు తన

2లో..

## శ్రీవారిపై వైసీపీ చేసింది

# మహాపాపం

### - అసెంబ్లీలో సంచలన విషయాలు బయటపెట్టిన సీఎం చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన లడ్డూ కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం శాసనసభలో జరిగిన ఈ చర్చలో సీఎం చంద్రబాబు మహాపాపం పేరుతో ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలను లెక్కలతో సహా వివరించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా అధికారులు, పాలకులు కలిసి చేసిన ఈ కుట్రను ఆయన తీవ్రంగా

2లో..



## సేవా తీర్థ్‌లో

# తొలి కేబినెట్ భేటీ

### - కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు

2లో..

# ఆ వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

### - రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ జైలుకెళ్లడం ఖాయం అని అన్నారు.'ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో రేవంత్ రెడ్డి, మళ్లీ నువ్వు చిప్పకూడు తినే టైం వస్తుంది. తప్పకుండా ఆ రోజు నువ్వు తగిన శిక్షను అనుభవిస్తావు'అంటూ శాపనార్థాలు పెట్టారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్నమాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తోపాటు ఇతర పార్టీ నేతలను ములాఖత్ ద్వారా కేటీఆర్ పరామర్శించారు. అనంతరం జైలు బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.'రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ఎన్ని అరాచకాలు చేసినా కాంగ్రెస్ పార్టీకి,బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారు. మా పార్టీ అభ్యర్థులను బెదిరించడం, భయపెట్టడం, దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ చేసింది. ఇదే కాకుండా ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసే విధంగా అనేక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన అరాచకాలను, దుర్మార్గాలను మొత్తం రాష్ట్రం గమనించింది'అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

**క్యాతన్‌పల్లిలో ప్రజాతీర్పు అపహాస్యం**

'మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి 10 స్థానాలు, మాతో పొత్తులో ఉన్న సిపిఐ పార్టీకి 4 స్థానాలు వచ్చాయి. అంటే మొత్తం 14 స్థానాల్లో గెలుపొందాం.కాంగ్రెస్

2లో..

## కాంగ్రెస్, ఎంఐఎంకు

# బుద్ధి చెబుతాం

### - బండి సంజయ్ సంచలన కామెంట్స్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దర్శించుకున్నారు. తెలంగాణలో కాషాయ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే భాగ్యలక్ష్మి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కరీంనగర్ మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు సహా పలువురు కౌన్సిలర్లతో కలిసి భాగ్యలక్ష్మి ఆలయానికి వెళ్లిన బండి సంజయ్ అమ్మవారిని దర్శించుకుని మీడియాతో మాట్లాడారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్ లాగే చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఈ సందర్భంగా బండి సంజయ్ హామీ ఇచ్చారు. హిందూ సమాజానికి రక్షణ కవచంగా ప్రస్తుతం ఈ భాగ్యలక్ష్మి ఆలయం ఉందని పేర్కొన్నారు. మరోవైపు తాను గతంలో నిర్వహించిన ప్రజా సంగ్రామ యాత్ర

2లో..

# దశాబ్దాల పోరాటం ముగిసింది

### - మావోయిస్టు అగ్రనేతల లొంగుబాటు
### - ఇక ఉనికి కోల్పోయినట్లేనా?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మావోయిస్టు ఉద్యమంలో టాప్ పొజిషన్‌లో ఉన్న నలుగురు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ముందు లొంగిపోయారు. మావోయిస్టు పార్టీలో అత్యున్నత నిర్ణయాత్మక విభాగాలైన పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్న కీలక నేతలు అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. లొంగిపోయిన వారిలో పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనే నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న ఉన్నారు. దశాబ్దాల కాలంగా అడవుల్లో ఉంటూ సాయుధ పోరాటాన్ని నడిపిన వీరు, పోలీసుల ముట్టడి , అనారోగ్య కారణాలతో తుపాకీని వీడారు.

2లో..

# హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను చూస్తూ ఊరుకోం

### - కల్తీ నెయ్యిపై చర్చలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో జరిగిన చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అత్యంత భావోద్వేగంతో కూడిన ప్రసంగం చేశారు.?

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అపచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు

. కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా, కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంగా దీనిని పరిగణించాలని ఆయన సభలో పిలుపునిచ్చారు.

**గత టీటీడీ బోర్డుదే తప్పు**

**- జగన్ ఎందుకు సమర్థిస్తున్నారు?**

పవన్ కల్యాణ్ తన ప్రసంగంలో ప్రధానంగా గత టీటీడీ బోర్డు వైఫల్యాలను ఎత్తిచూపారు. నేను ఎక్కడా వ్యక్తిగతంగా వైఎస్ జగన్ తప్పు చేశారని చెప్పలేదు, కానీ ఆనాటి టీటీడీ బోర్డుదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు దానిని అంగీకరించి తప్పు సరిదిద్దుకోకుండా, తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం శోచనీయమని మండిపడ్డారు. రూ. 400 లకే స్వచ్ఛమైన ఆవు నెయ్యి లభిస్తుందని నమ్మడం సాధ్యం కాదని, కనీసం

2లో..

# సెల్ ఫోన్ లోనే టికెట్ల బుకింగ్, బస్సు పాసులు

### - ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పిన టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బస్సు ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ప్రస్తుతం కేవలం ఆన్‌లైన్, రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా బస్ టికెట్లు బుక్ చేసుకునేందుకు టీజీఎస్‌ఆర్‌టీసీ పోర్టల్ మాత్రమే అందుబాటులో ఉండగా ఇప్పుడు ప్రయాణికులకు మరో సౌకర్యాన్ని కల్పించింది. ఇక నుంచి ప్రయాణికులు మీ సేవ మొబైల్ యాప్‌లో కూడా టీజీఎస్‌ఆర్టీసీ బస్ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని వెల్లడించింది. ప్రయాణికుల సౌకర్యం కోసమే ఈ యాప్ బుకింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు స్పష్టం చేసింది.

2లో..



# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

### - ఏపీ క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా

2లో..



## హైదరాబాద్‌లో పట్టు సాధించేందుకు
# రేవంత్ మాస్టర్ ప్లాన్

ప్రస్తుతం ఉన్న 650 చదరపు కిలోమీటర్ల నుండి 2000 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరించే ప్రతిపాదన తెచ్చింది. చుట్టుపక్కల ఉన్న మున్సిపాలిటీలను గ్రేటర్ లో విలీనం చేయడం ద్వారా ఓటర్ల సంఖ్యను పెంచి, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. జీహెచ్ఎంసీని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి విభజించారు. గతంలో వైఎస్ఆర్ అనుసరించిన ఫార్ములాను రేవంత్ అమలు చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### అభివృద్ధి మంత్రం - మౌలిక సదుపాయాలే అస్త్రాలు

రాబోయే మూడు కార్పొరేషన్ల ఎన్నికల లోపు నగర రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. మూసి నది పునరుజ్జీవనం, మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూ.2,787 కోట్ల కేటాయింపు, బంజారాహిల్స్ నుండి శిల్పా లేఅవుట్ వరకు కొత్త రహదారి నిర్మాణం వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా విశ్వనగరం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా నగర ఓటర్ల మనసు గెలవాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది.

### విపక్షాల ముందున్న సవాళ్లు

ప్రస్తుత ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ దూకుడును అడ్డుకోవడానికి బలమైన నాయకత్వం, స్థానిక అజెండాతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ తన పాత కోటను కాపాడుకోవడానికి నగర వాసుల్లో మళ్ళీ నమ్మకం కలిగించాల్సి ఉంది. ఈ త్రిముఖ పోరులో రేవంత్ రెడ్డి సర్కార్ వేస్తున్న ముందడుగులు విపక్షాలకు మున్ముందు గడ్డు కాలం మిగిల్చేలా ఉన్నాయి.

# ప్రధాని తన ఇమేజ్ కోసమే ఒత్తిడికి తలొగ్గారు

వద్ద ఉన్నాయని, వాటిని ఇంకా బయటపెట్టలేదని ఆయన తెలిపారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా తలపెట్టిన కిసాన్ సమ్మేళనాలకు ఈ సభతో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు. ఈ ఒప్పందం వల్ల పత్తి, సోయాబీన్, మొక్కజొన్న వంటి పంటలకు ప్రమాదం వాటిల్లుతుందని, రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో త్వరలో ఇలాంటి సభలు నిర్వహించనున్నారు.

# శ్రీవారిపై వైసీపీ చేసింది మహాపాపం

ఖండించారు.

### 20 కోట్ల కల్తీ లడ్డూల పంపిణీ

2019 నుంచి 2024 మధ్య కాలంలో తిరుమల శ్రీవారి లడ్డూల తయారీలో భారీగా కల్తీ నెయ్యిని వినియోగించారని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితోనే తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం అక్రమమే కాదని, కోట్ల మంది భక్తుల విశ్వాసంపై జరిగిన దాడి అని ఆయన అభివర్ణించారు.

### 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి

గత ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యిలో దాదాపు 59.71 లక్షల కిలోలు కల్తీగా తేలిందని సీఎం వివరించారు. ఈ నెయ్యి కొనుగోలు కోసం అప్పట్లో సుమారు రూ. 231.51 కోట్లు ఖర్చు చేశారని, అయితే నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని నెయ్యిని సేకరించడం ద్వారా భారీ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.

### ఎన్‌డీడీబీ రిపోర్టుపై క్లారిటీ

లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిసిందనే విషయాన్ని తాను రాజకీయ ప్రయోజనాల కోసం చెప్పలేదని, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఇచ్చిన అధికారిక నివేదిక ఆధారంగానే ఆ నిజం బయటపడిందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ భగవంతుడే నా చేత ఈ నిజాన్ని బయటపెట్టించాడు అని ఆయన భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. కల్తీ అని రిపోర్టులు వచ్చినా గత పాలకులు వాటిని తొక్కిపెట్టారని ఆయన విమర్శించారు.

### వ్యవస్థీకృత నేరంగా అభివర్ణన

నెయ్యి సరఫరాలో ఒక సిండికేట్ ఏర్పడి ప్రణాళికాబద్ధంగా ఈ కల్తీకి పాల్పడ్డారని సీఎం తెలిపారు. ఫోరెన్సిక్ సాక్ష్యాలు కూడా దీనిని బలపరుస్తున్నాయని, ఇది ఒక వ్యవస్థీకృత నేరమని ఆయన పేర్కొన్నారు. కేవలం లాభాపేక్షతోనే కాకుండా, హిందూ ధర్మంపై ఉన్న వ్యతిరేకతతో కూడా ఇలాంటి పనులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

### కఠిన చర్యలు - ఏకసభ్య కమిటీ

ఈ అక్రమాలపై ఇప్పటికే సిట్ విచారణ జరుగుతోందని, సుప్రీంకోర్టు సూచనల మేరకు విచారణ ప్రక్రియ కొనసాగుతోందని ముఖ్యమంత్రి సభకు తెలిపారు. కేవలం లడ్డూల అంశమే కాకుండా, తిరుమలలో జరిగిన ఇతర పాలనాపరమైన అక్రమాలను వెలికితీసేందుకు ఒక ఏకసభ్య కమిటీని కూడా నియమించినట్లు వెల్లడించారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని, కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు.

### భవిష్యత్తు ప్రణాళిక - ప్రత్యేక చట్టం

తిరుమల పవిత్రతను కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం హామీ ఇచ్చారు. అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్ తరహాలో టీటీడీకి కూడా ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. దేవాలయ నియమాలను ఉల్లంఘించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా ఈ చట్టాన్ని రూపొందిస్తామని, భవిష్యత్తు లో ఇలాంటి 'మహాపాపాలు' పునరావృతం కాకుండా అరికడతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## సేవా తీర్థ్‌లో
# తొలి కేబినెట్ భేటీ

ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు.

ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్దాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆ వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

కేవలం 7 స్థానాల్లోనే గెలుపొందింది.అత్యధిక స్థానాల్లో తాము గెలుపొందినా మున్సిపల్ చైర్మన్ పదవిని చేజిక్కకుండా కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేసింది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేవలం ఏడు స్థానాలు గెలిచి అప్రజాస్వామికంగా ఆ మున్సిపాలిటీని దక్కించుకునే అధికార దాహం, కక్కుర్తి కాంగ్రెస్ పార్టీ చూపించింది అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు స్థానిక మంత్రి వివేక్ దురాగతాలు, అధికార యంత్రాంగం పూర్తిగా అరాచకంగా ప్రవర్తించి ప్రజలు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### పోలీసులను ఎంపీ అరవింద్ దూషించిన కేసుల్లేవ్

'రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం వంటి చోట్ల కూడా ఇదే రకమైన అరాచకాన్ని కాంగ్రెస్ పార్టీ చేసింది. అయితే క్యాతన్‌పల్లిలో ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా మా 14 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి లొంగకుండా నిలబడితే, మా పార్టీ మహిళా కౌన్సిలర్ల మీద కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అసభ్యంగా ప్రవర్తించి దాడికి దిగినా అక్కడ ఉన్న మంత్రి గానీ, ఎంపీ గానీ నవ్వుకుంటూ చూశారు కానీ నిలువరించే ప్రయత్నం చేయలేదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇంత దిగజారుడు రాజకీయం బహుశా దేశ చరిత్రలో ఎక్కడ కూడా జరిగి ఉండదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు జనగామలో కూడా దళిత మహిళా కౌన్సిలర్‌ను చేయి పట్టి బలవంతంగా గుంజి చిల్లరగా ప్రవర్తించారు. అయితే క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అరాచకాలను అధికారుల అక్రమాలను ప్రశ్నిస్తే మా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు మూల రాజిరెడ్డిని, ఇంకొంతమంది పార్టీ నేతలను అరెస్ట్ చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకున్నందుకే మా పార్టీ నాయకుల పైన అక్రమ కేసులు పెట్టిన ఈ ప్రభుత్వం మరి సొంత పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కానీ, బీజేపీ ఎంపీ అరవింద్ కానీ పోలీసులను అడ్డగోలుగా బూతులు తిట్టిన, బట్టలు ఊడదీసి కొడతా అన్న, ఈడియట్ అంటూ యూజ్ లెస్ ఫెలో అంటూ మాట్లాడిన ఎలాంటి కేసులు లేవు'అని కేటీఆర్ ప్రశ్నించారు.

### పొత్తు ధర్మానికి కట్టుబడ్డ సీపీఐ కౌన్సిలర్లకు థ్యాంక్స్

'రాష్ట్ర డీజీపీ ఒక పార్టీకి ఒక న్యాయం, కాంగ్రెస్ – బీజేపీకి ఇంకో న్యాయం అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ నాయకుల అరాచకాలు డీజీపీకి కనిపించడం లేదా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మరోవైపు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఒక్కొక్కరికి మూడు కోట్ల రూపాయల డబ్బులు ఆశ చూపినా నిజాయితీ కలిగిన బిడ్డలుగా కౌన్సిలర్లు లొంగలేదు. మీ పైసలు వద్దు, ఖచ్చితంగా మా నాయకుడు కేసీఆర్ వెంట ఉంటాం, మా సోదరుడు సుమన్ వెంట ఉంటామంటూ అండగా నిలబడ్డారు. ఇంత బలంగా నిలబడిన మా పార్టీ కౌన్సిలర్లకు, పొత్తు ధర్మానికి అనుగుణంగా నిలబడిన సిపిఐ నాయకులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

### జైలుకు పోవడం బాల్క సుమన్‌కి కొత్తేమీ కాదు

'మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ని జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న వాళ్ళకి ఒక్కటే చెబుతున్నా. సుమన్‌కి ఇవాళ జైలుకు పోవడం కొత్త కాదు, ఉద్యమ కాలంలో అనేకసార్లు జైలుకు పోయిండు, ఆరు నెలలకు పైగా వివిధ సందర్భాల్లో జైల్లో ఉన్నాడు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు.'పోలీసుల అరాచకాలు, పోలీస్ స్టేషన్లు అయితే లెక్కలో లేనంత గొప్పగా పోరాటం చేసిండు. అలాంటిది రేవంత్ రెడ్డి ఈ అక్రమ కేసుతో మా నాయకుడిని భయపెట్టిస్తామంటే ఎవరూ భయపడరు. ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకో రేవంత్ రెడ్డి, మళ్ళీ నువ్వు చిప్పకూడు తినే టైం వస్తుంది. తప్పకుండా ఆ రోజు నువ్వు తగిన శిక్షను అనుభవిస్తావు'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శాపనార్థాలు పెట్టారు.

### ఖాకీ బుక్ ఎక్కడికి పోయింది?

'రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కూడా పెద్ద పెద్ద సినిమా డైలాగులు కొట్టినాడు – రెడ్ బుక్ ఉండదు, పింక్ బుక్ ఉండదు, ఖాకీ బుక్ ఉంటుంది అని. మరి ఈరోజు కాకి బుక్ ఎక్కడికి పోయింది? మీ పోలీసులను యూజ్ లెస్ ఫెలో అన్న, బట్టలు ఊడదీసి కొడతా అన్న కేసు ఎందుకు పెట్టడం లేదు?'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు.'రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది కాబట్టి వాళ్లకు ఒక నీతి, ప్రతిపక్షంలో ఉన్నాము కాబట్టి మాకు ఒక నీతి అనే విషయాన్ని డీజీపీ తెలియజేయాలి.
డీజీపీ గానీ, రేవంత్ రెడ్డి గానీ అధికారం ఎవడికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. రానున్న రెండు సంవత్సరాల్లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగురుతుంది. కచ్చితంగా మీ అరాచకాలకు అప్పుడు తగిన శిక్షను అనుభవిస్తారు. ఈరోజు చట్టాలను, ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రతి ఒక్కరిని వదిలిపెట్టకుండా ఎక్కడున్నా పట్టుకొని ఖచ్చితంగా శిక్షిస్తాం'అని కేటీఆర్ హెచ్చరించారు.

### తప్పు చేసిన అధికారులను వదిలిపెట్టం

'ఇక ఎలక్షన్ కమిషన్ కూడా ప్రజాస్వామికంగా, రాజ్యాంగబద్ధంగా పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. వెంటనే క్యాతన్‌పల్లి మరియు ఇబ్రహీంపట్నం, ఖానాపూర్‌లో ఎన్నికలు నిజాయితీగా, పారదర్శకతగా పెట్టాలి. సీసీ కెమెరాల మధ్య సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు జరగనివ్వండి. గెలిచిన వాళ్లను ప్రమాణ స్వీకారం చేయనియ్యండి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు.

'రాష్ట్రంలోని కొంతమంది పోలీసులు కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కన్నా దారుణంగా పనిచేస్తున్నారు. అలాంటి వాళ్ళు అవసరమైతే కాంగ్రెస్ కండువాలు కప్పుకుని పనిచేయాలని హెచ్చరిస్తున్నాం. ఎవరు ఎవరైతే తప్పులు చేశారో వాళ్ళందరినీ గుర్తుంచుకొని ఖచ్చితంగా వాళ్లను వదిలిపెట్టేది లేదు. మా ఎమ్మెల్యే ఆదివాసీ బిడ్డ కోవ లక్ష్మిపైనా కూడా అక్రమంగా కేసు పెట్టారు. నిజాయితీగా పార్టీ పని చేసి, ప్రజాస్వామికంగా ప్రజల తీర్పును గౌరవించేలా కాపాడుకోవడమే ఆమె చేసిన తప్పా? ఇలా అడ్డగోలుగా అక్రమ కేసులు పెడుతున్న ప్రతి ఒక్కరూ రానున్న రోజుల్లో శిక్ష అనుభవించక తప్పదు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు.

# కాంగ్రెస్, ఎంఐఎంకు బుద్ధి చెబుతాం

భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం నుంచే మొదలై సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్లు గుర్తు చేసుకున్నారు. 2021 ఆగస్టు 28వ తేదీన ప్రజా సంగ్రామ యాత్ర ప్రారంభం కాగా ఆ యాత్రకు నేటితో సరిగ్గా 1640 రోజులు పూర్తి కావడం ఒక అద్భుతమని అలాంటి రోజున మళ్లీ అమ్మవారిని దర్శించుకున్నట్లు వివరించారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ ఆలయాలపై దాడులు పెరిగాయని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం సహా సంతోష్ నగర్, శంషాబాద్‌లలో ఉన్న ఆలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేశారని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీతో కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కై హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో మెజారిటీ ప్రజలు తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకునేందుకు బిచ్చమెత్తుకునే పరిస్థితి వచ్చిందని బండి సంజయ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బండి సంజయ్ ఆరు గ్యారంటీల అమలుపై నిలదీశారు. 18 మంత్రివర్గ సమావేశాల్లో రైతు భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం వంటి హామీలపై ఒక్కసారి కూడా చర్చ జరగలేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల సమస్యలను గాలికొదిలేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి మూటలు మోసే బిజీలో ఉన్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల మాటే సీఎం రేవంత్ రెడ్డి ఎత్తడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ బిజినెస్ చేస్తోందని మండిపడ్డారు. బతికి ఉన్న వారికి ప్రయోజనాలు కల్పించకుండా చనిపోయిన తర్వాత బీమా ఇస్తామనడం ఏంటని ప్రశ్నించారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలవడం ఒక ఆరంభం మాత్రమేనని రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాషాయ పార్టీ జెండా రెపరెపలాడుతుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఎంఐఎం అరాచకాలను అడ్డుకునే సత్తా కేవలం బీజేపీకి మాత్రమే ఉందని తేల్చి చెప్పారు. భాగ్యనగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అభివృద్ధిని అడ్డుకుంటోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా హిందూ సమాజం మేల్కోవాలని ధర్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. బాన్సువాడలో బీజేపీ నేతలపై జరుగుతున్న అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# సెల్ ఫోన్ లోనే టికెట్ల బుకింగ్, బస్సు పాసులు

మీ సేవ మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఆర్టీసీ బస్ టికెట్లను బుక్ చేసుకునే సౌకర్యాన్ని అధికారులు తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే వారందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సచివాలయంలో తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కొత్త మీ సేవ మీ టికెట్ యాప్‌ను మంగళవారం ప్రారంభించారు. రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, తెలంగాణ ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి, మీ సేవ కమిషనర్ రవికిరణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మొబైల్ యాప్‌ను ఆవిష్కరించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ ఓపీఆర్ఎస్ సేవలను కూడా అనుసంధానించారు. దీంతో ప్రయాణికులు దూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్ టిక్కెట్లను కూడా డిజిటల్‌గా బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.
మొత్తం ఓపీఆర్ఎస్ సేవలు 1,710 ఏసీ సేవలు 450 నాన్ ఏసీ సేవలు 1,260 రోజువారీగా బుకింగ్ అయ్యే సీట్లు 13,000 అని అధికారులు వెల్లడించారు. బెంగళూరు, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, మంచిర్యాల, ఖమ్మం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వరంగల్ వంటి హైదరాబాద్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఈ టికెట్ బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో 5 రకాల బస్ పాస్‌లను కూడా పొందే సౌకర్యంతోపాటు రెన్యూవల్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పించారు. ఇప్పటివరకు స్టూడెంట్, జనరల్ బస్ పాస్‌లు కావాలంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసే బస్ పాస్ కౌంటర్లకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేది. అక్కడ క్యూలైన్లలో నిలబడి వేచి చూసి తీసుకోవాల్సి ఉండేది. కానీ ఇక నుంచి డిజిటల్ విధానంలోనే బస్ పాస్‌లను పొందే అవకాశం కల్పించారు. ఈ నిర్ణయం వల్ల బస్ పాస్ కౌంటర్లకు వెళ్లే బాధ తప్పింది. బస్ పాస్ రెన్యూవల్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. నిత్యం హైదరాబాద్‌లో బస్ పాస్ ద్వారా లక్షల మంది ప్రయాణాలు చేస్తుండగా ఈ నిర్ణయం వారికి భారీ ఊరట కల్పించనుంది. సిటీ ఆర్డినరీ బస్ పాస్ నెలకు రూ.1,400.. మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ రూ.1,600 మెట్రో డీలక్స్ పాస్ రూ.1,800 గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ నెలవారీ పాస్ రూ.2,200 పుష్పక్ ఏసీ పాస్ రూ.5,000గా వసూలు చేస్తున్నారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది.రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# దశాబ్దాల పోరాటం ముగిసింది

### ఉద్యమం ముగింపు దిశగా..

విలేకరుల సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి ఈ లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ కేంద్ర మరియు రాష్ట్ర స్థాయి వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలాయని స్పష్టం చేశారు. వరాష్ట్ర కమిటీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు లొంగిపోవడంతో తెలంగాణలో మావోయిస్టు వ్యవస్థ నిర్వీర్యమైంది. సిద్ధాంతాల పట్ల అయోమయం, అంతర్గత విభేదాలు, క్షేత్రస్థాయి వాస్తవాల దృష్ట్యా వీరు హింసను వీడి బయటకు వచ్చారు అని ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ పునరావాస పథకం కింద సుమారు 90 లక్షల రూపాయల రివార్డు మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశారు.

### తెలంగాణలో మిగిలి ఉన్న బలం ఎంత?

రాష్ట్రంలో మావోయిస్టుల ఉనికి గురించి డీజీపీ కీలక సమాచారం అందించారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన కేవలం 11 మంది క్యాడర్ మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో మాజీ అగ్రనేత గణపతి కూడా ఉన్నారని తెలిపారు. అయితే ఈ 11 మందిలోనూ కేవలం ఒకరు లేదా ఇద్దరు మాత్రమే చురుగ్గా ఉన్నారని, మిగిలిన వారంతా ఉద్యమానికి దూరంగా లేదా ఇతర రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం దాదాపు శూన్యమైందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

### అజ్ఞాతంలో దశాబ్దాల ప్రస్థానం

లొంగిపోయిన నేతలు దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా అజ్ఞాతంలో గడిపారు. తిప్పిరి తిరుపతి 44 ఏళ్లుగా, మల్లా రాజిరెడ్డి 46 ఏళ్లుగా పోలీసులకు దొరకకుండా సాయుధ పోరాటంలో కొనసాగుతున్నారు. చొక్కారావు 28 ఏళ్లు, నర్సింహారెడ్డి 36 ఏళ్లుగా అడవుల్లోనే జీవించారు. ఆయుధాల తయారీలో దిట్టగా పేరున్న దేవ్ జీ, పార్టీ సైనిక విభాగానికి ఇన్‌ఛార్జ్‌గా కూడా పనిచేశారు. వీరు బయటకు రావడం మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా భద్రతా దళాలు విశ్లేషిస్తున్నాయి.

### మెరుగైన పునరావాసం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు, హింసను వీడి వచ్చే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. లొంగిపోయిన నేతలకు తక్షణ ఆర్థిక సాయంతో పాటు, ఆరోగ్య సంరక్షణ , గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అడవుల్లో ఇంకా మిగిలి ఉన్న వారు కూడా కాలం చెల్లిన సిద్ధాంతాలను పక్కన పెట్టి, సమాజ వికాసంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## హిందూ ధర్మంపై జరుగుతున్న
# దాడులను చూస్తూ ఊరుకోం

నువ్వుల నూనె కూడా ఆ ధరకు దొరకదని ఆయన ఎద్దేవా చేశారు.



### అసలు అది నెయ్యే కాదు !

ల్యాబ్ రిపోర్టులు, సిట్ విచారణ అంశాలను ప్రస్తావిస్తూ, లడ్డూ తయారీకి వాడినది అసలు నెయ్యే కాదని, అది పామాయిల్ , రసాయనాల మిశ్రమమని పవన్ కల్యాణ్ ఆరోపించారు. నెయ్యిలో జంతు కొవ్వు లేదని సిట్ నివేదికలో ఎక్కడా చెప్పలేదని, ఎన్‌డీడీబీ నివేదికలో జంతు కొవ్వు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రసాయనాలతో తయారు చేసిన ఈ ద్రవాన్ని ప్రసాదంగా వినియోగించడం వల్ల భక్తుల ఆరోగ్యం మరియు విశ్వాసం దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### అయోధ్యకూ కల్తీ నెయ్యితో చేసిన లడ్డూలు పంపించారు!

ఈ అపచారం కేవలం తిరుమలకే పరిమితం కాలేదని, అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్టకు కూడా ఇక్కడి నుంచే కల్తీ లడ్డూలు పంపారని పవన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను మేం చూస్తూ ఊరుకోం. వేరే మతాలకు ఇలాంటి అన్యాయం జరిగితే ప్రపంచవ్యాప్తంగా గగ్గోలు పెట్టేవారు, మరి హిందువుల విషయంలో ఎందుకు మౌనం? అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే సనాతన ధర్మ పరిరక్షణ కోసం జాతీయ స్థాయిలో ఒక బోర్డు ఉండాలని ఆయన పునరుద్ఘాటించారు.

### కల్తీ నెయ్యి నిందితులు శిక్ష అనుభవించాల్సిందే

భగవంతుడి విషయంలో అపచారాలకు పాల్పడిన వారు ఎవరైనా సరే కఠినంగా శిక్షించబడతారని పవన్ హెచ్చరించారు. శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద లోని పద్యాన్ని ఉటంకిస్తూ, పాలకులకు ధర్మం పట్ల ఉండాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తిరుమల పవిత్రతను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో భక్తి వైభవంగా
# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవం



**హైదరాబాద్** జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం దివ్యమంగళ హారతుల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు పుష్పాలతో, పతాకాలతో అలంకరించిన మహారథాన్ని అధిరోహించి భక్తకోటికి కృపాకటాక్ష దర్శనం ప్రసాదించారు. "గోవిందా? గోవిందా?" నినాదాలతో మారుమోగిన ఆలయ పరిసరాల్లో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాలు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. శ్రీవారి రథదర్శనం జన్మజన్మాంతర పాపాలను హరించి భక్తులకు మోక్షసౌభాగ్యం ప్రసాదిస్తుందని, రథస్థుడైన మాధవుడి దర్శనం పునర్జన్మ బంధనాలను నివారిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ దివ్య ఉత్సవ శ్రేణిలో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారు అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులకు పుణ్యదర్శనం అనుగ్రహించనున్నారు.

# ఎం బి యు ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**తిరుపతి** మోహన్ బాబు యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. చంద్రగిరి మండలం, రంగంపేటలో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్లో ఘటన జరిగింది. మృతురాలు పుంగనూరు నియోజకవర్గం లోని మంగళం కు చెందిన విద్యార్థి భువన. మోహన్ బాబు యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఫైనల్ ఇయర్ బీటెక్ చదువుతోంది. విషయం తెలుసుకున్న చంద్రగిరి పోలీసులు మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ అన్నారు.

# ఏసీబీ వలలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్! ?




**పశ్చిమ గోదావరి :** అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు మరోసారి విరుచుకుపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీగా లంచం తీసుకుంటూ అటవీ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ?భీమవరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సురేష్, ఒక పని నిమిత్తం బాధితుడి నుంచి 4 లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించింది.

**రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ :** సురేష్ తన కార్యాలయంలో బాధితుడి నుంచి నగదు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. ?నగదు స్వాధీనం: నిందితుడి వద్ద నుంచి రూ. 4 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ? తనిఖీలు : ప్రస్తుతం సురేష్ కార్యాలయం మరియు నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ?"అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు" అని ఏసీబీ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.


# గూడూరులో టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి



సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయం లో గూడూరు పట్టణం సాధుపేట సెంటర్ నుండి నారాయణ కాలేజీ మీదుగా మినీ బైపాస్ కు పోవు దారిలో రోడ్డు పై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని టిప్పర్ లారీ ఢీకొట్టగా ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు అని మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని మృతుడు ధరించిన బట్టలు,ఆనవాళ్ళు ను బట్టి వివరాలు తెలిసినవారు గూడూరు 1 బిసీలిని పోలీస్ స్టేషన్ కి సమాచారం తెలుపగలరనీ ఎస్సై మనోజ్ కుమార్ కోరారు.

# నాటి నుంచి హిందూమతంపై వ్యవస్థీకృత దాడి

- తిరుమల గిరులను కుదించారు కల్తీతో అపవిత్రం చేశారు
- తిరుమల డిక్లరేషన్ పై జగన్ ధిక్కారం
- గత పాలనలో టీటీడీలో ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం
- జరిగిన అపచారాలపై తీవ్రంగా స్పందించిన హైందవ మఠాలు
- కల్తీకి ఆస్కారం లేని విధంగా కఠినతరంగా నిబంధనలు
- హిందువుల మనోభావాలు కాపాడే బాధ్యత మాది
- కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైసీపీ హయాంలో మహాపాపం పేరిట సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీఎంలి



అమరావతి(ప్రశ్న న్యూస్) ఓ పద్ధతి ప్రకారమే 2005 నుంచి హిందూమతంపై దాడి జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమల పరిధిని ఏడు కొండల నుంచి రెండు కొండలకు మాత్రమే పరిమితం చేస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో తీసుకువచ్చారని అప్పటి నుంచే హిందూ మతంపై క్రమబద్ధంగా దాడి చేస్తూ వచ్చారని ఆక్షేపించారు. అప్పటి పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శామ్యూల్ అనే క్రైస్తవ అధికారి ఈ జీవో జారీ చేశారని వివరించారు. హిందూ సమాజంతో పాటు రెండేళ్ల పాటు తాము చేసిన పోరాటాల కారణంగా వెనక్కు తగ్గారని సీఎం స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో చేపట్టిన లఘు చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ వ్యవహారంపై మహాపాపం పేరిట అసెంబ్లీలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో 20.01 కోట్ల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ వివాదం ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో సిట్ ఏర్పాటైందని సీఎం వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. తప్పు చేసిన నిందితులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని అన్నారు. అందుకే ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. లడ్డూ వ్యవహారంలో అనేక తప్పులు చేశారని సీఎం స్పష్టం చేశారు. 2019-24 మధ్య 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారని అన్నారు. రూ. 231.51 కోట్ల అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని నీరుగార్చారని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఓ ప్రణాళిక ప్రకారం లాలూచీ పడిన లూటి అని స్పష్టంగా తేలిందన్నారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా నివేదికలు వచ్చినా అప్పటి టీటీడీ ఛైర్మన్ దానిని తొక్కి పెట్టారని అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని తానేమి సొంతగా చెప్పలేదని ఎన్డీడీబీ కాఫ్ ఇచ్చిన నివేదికనే బయటకు వెల్లడించానని అన్నారు.

### అప్పటి బోర్డుకు, ఛైర్మన్ కు తెలియకుండా తప్పులు జరిగాయా.

కల్తీ నెయ్యి సరఫరాకు అనుగుణంగా టెండర్ నిబంధనల్ని సడలించారని రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సరఫరా చేయాలన్న నిబంధన తొలగించారని పేర్కొన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి 1 ఏడాదికి కుదించారన్నారు. రోజుకు 12 టన్నుల వెన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారని అన్నారు. అక్రమాలకు తెరతీసేలా డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారన్నారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారని.. వీటితో పాటు ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని కూడా నీరుగార్చారన్నారు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా పోమిల్ జైన్ , విపిన్ జైన్ తో పాటు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ ఉందన్నారు. ఏఆర్, శ్రీవైష్ణవీ, మాల్ గంగా డెయిరీలు భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలుగా వ్యవహరించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని సీఎం స్పష్టం చేశారు.

# నృసింహ మాలాధారులు అహోబిలంకి పయనం



**శిరివెళ్ల** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి గురు స్వామి లక్ష్మీ నరసింహుడు ఆధ్వర్యంలో మాలదారులు సుమారు 30 మంది భక్తులు స్వామి మాల ధరించిన స్వాములు 41 రోజులు పాటు భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో కఠోర దీక్ష, చేసి, ప్రత్యేక పూజలు, దీక్ష విరమణ చేసి అహోబిలానికి మంగళవారం బయలుదేరారు. 11 మంది స్వాములు కాలినడకన అహోబిలానికి బయలుదేరారు. స్థానిక రామాలయం లో గురుస్వాములతో ఇరుముడి కట్టించుకుని మేళతాళాలతోబయలుదేరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రకాశం, మార్కాపురం జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. విద్యార్థులు భయం లేకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనువుగా అన్ని భద్రతా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసర గుంపులు ఏర్పడకుండా, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు చేయడంతో పాటు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజలు పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీస్ శాఖకు సహకరించాలని, విద్యార్థులు తమ పరీక్షలపై పూర్తి దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. పరీక్షలు పూర్తయ్యే వరకు బందోబస్తు కొనసాగుతుందని తెలిపారు.


# రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల రిలే దీక్షలు



రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఈ నెల 23 నుంచి 27 వరకూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ నియమ నిబంధనలు రూపొందించాలని, పెండింగ్లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో మార్చి 2న విజయవాడ ధర్నాచౌక్ లో మహాధర్నా నిర్వహించనున్నారు.

# నందిపల్లెలోని నూతన నందీశ్వరాలయ మహోత్సవం

**– హోమాలు, పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి**



వేంపల్లె(ప్రశ్న న్యూస్) మండలం నందిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన నందీశ్వరాలయంలో మంగళవారం వైభవంగా హోమాలు, ప్రత్యేక పూజలు, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ మారం శ్రీకాంత్ రెడ్డి అత్యంత భక్తిశ్రద్ధలతో, అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో ఈ ఆలయాన్ని నిర్మించారని ప్రశంసించారు. గ్రామ పరిసర ప్రాంతాల భక్తులకు ఇది ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఈ నెల 25వ తేదీన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

# దుద్దిళ్ల శ్రీను బాబుకు పెద్దపల్లి సర్పంచుల జన్మదిన శుభాకాంక్షలు

**నిండు నూరేళ్లు ప్రజాసేవలో తరించాలని ఆకాంక్ష**



పెద్దపల్లి ( ప్రశ్న న్యూస్ )టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీను బాబు జన్మదిన వేడుకలు సర్పంచుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లాలోని సర్పంచుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శ్రీను బాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తండ్రి కీర్తి శేషులు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావుకు తగ్గ తనయుడిగా , అన్న పేరు నిలబెట్టే సోదరుడిగా , ప్రజా సేవలో నూరేళ్లు జీవించాలని కోరుకుంటూ కేకు కట్ చేశామని బెస్తపల్లి సర్పంచి శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్ లో తెలంగాణలో ముఖ్య నాయకుడిగా ఎదగాలని తమ సర్పంచులంతా ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# ఉద్దేశపూర్వకంగా నన్ను ఇరికించారు

**– ఐపీఎస్ సునీల్ నాయక్**

**విజయవాడ** రఘురామకృష్ణంరాజు కేసులో నిందితుడుగా వున్న ఐపిఎస్ అధికారి సునీల్ నాయక్ ఎక్స్ లో సంచలన పోస్ట్ చేసారు. నేను ఎస్టీగా పుట్టడమే నేరమా? ఉన్నత ఉద్యోగాల్లో చిన్నకులాలవారు ఉంటే జీర్ణించుకోలేరా? రఘురామ కేసులో ఉద్దేశపూర్వకంగా నన్ను ఇరికించారని ఆరోపించారు. 2021లో జరిగిన ఘటన ఇది.

2024లో ఎఫ్ఐఆర్ లో నా పేరు లేదు. నా పాత్ర లేకున్నా నన్ను నిందితుడిగా కేసులో చేర్చారు. ఫిర్యాదుదారుడు నాకు కాల్ చేశాడు. మాజీ సీఎం జగన్ మీద, పీవీ సునీల్ కుమార్ మీద చెప్పాలనీ..లేకుంటే కేసులో నేరస్తుడివి అవుతావని బెదిరించాడు. రఘురామ కాలేటా బయటకు తీస్తే..ఈ కేసులో ఎంతమందిని ప్రభావితం చేశారో తెలుస్తుంది. సరైన సమయంలో ఆధారాలు బయటపెడతా నని పేర్కొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

**గంజాయి సాగును పూర్తిగా అరికట్టాము**

**డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాము**

**డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యుల పై కూడా దృష్టి పెట్టాం:మంత్రి అనిత**

అమరావతి(ప్రశ్న న్యూస్) మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత ప్రకటించారు. ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అనే సందేశం ప్రజల్లోకి పంపామని గుర్తుచేశారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో నేరాలు పెరిగాయన్న వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణలను శాసనమండలిలో మంత్రి అనిత తిప్పికొట్టారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని అనిత తెలిపారు. ఈ సంవత్సరం మహిళపై అత్యాచారాలు, హత్యలు నాలుగు శాతం తగ్గాయని చెప్పడానికి నేను చాలా గర్వంగా ఫీల్ అవుతున్నానని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపిందన్నారు. గంజాయి నిర్మూలనకు ఈగల్ అనే ఒక ప్రత్యేకమైన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. గంజాయి సాగును జీరో చేశామని అన్నారు. మదనపల్లి ఘటన చాలా బాధాకరమన్నారు. కానీ దారుణానికి ఒడిగట్టిన నేరస్థుడిపై ప్రభుత్వం వైపు నుంచి ఒత్తిడి పెరగడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, నేరాలు చేసే ఎవరికైనా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. మహిళా రక్షణ, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. పోక్సో కేసుల్లో శిక్షలు 15 శాతం పెంచగలిగామన్నారు. 506 మందికి శిక్షలు పడితే.. అందులో 9 మందికి మరణ శిక్షలు పడ్డాయని,169 మందికి జీవితఖైదు పడిందని చెప్పారు.నేరస్థులకు బెయిల్ రాకముందే శిక్షలు వేయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చేసరికి స్కూల్ పిల్లల బ్యాగుల్లోకి గంజాయి వెళ్ళిందని, ఇప్పుడు అదే స్కూల్ పిల్లలు రోడ్డు మీదకు వచ్చి గంజాయి వద్దు బ్రో- డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. ఒకానొక సందర్భంలో



ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్,గంజాయి కు హాబ్ అని, ఈరోజు గంజాయిని ఎలా అరికట్టాలో ఆంధ్రప్రదేశ్ ను చూసి నేర్చుకునే పరిస్థితి అని చెప్పారు. అందరినీ వెతుకుతున్నాం, ఆఖరికి డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యులకు పై కూడా దృష్టి పెట్టామన్నారు. 24 గంటల నుండి 48 గంటల లోపు ఏ నిందితునైన పట్టుకొని అరెస్టు చేస్తున్నామని హోం మంత్రి అనిత అన్నారు.

## సహకార ఉద్యోగులు సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి :సిఐటియు



అనకాపల్లి(ప్రశ్న న్యూస్)16 నుండి నిరవధిక సమ్మె లోనికి సహకార ఉద్యోగులు వెళ్లడం జరిగింది. సమ్మె ఈరోజు 9వ రోజుకు చేరుకుంది .దీనిలో భాగంగా ఎలమంచిలి డిసిసిబి వద్ద నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడి మద్దతు తెలిపారు .అనకాపల్లి జిల్లా విశాఖ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ ఉద్యోగుల యూనియన్ రాయివరపు శివరామకృష్ణ మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా రైతులకు ప్రాథమిక స్థాయిలో ఎరువులు ,విత్తనాలు ,సకాలంలో అందేలా సహకార ఉద్యోగులకు సేవలు అందించారు.2019మార్చిలో జీవో నెంబర్ 36 విడుదల చేయడం చేసినా నేటికి ప్రభుత్వాలు సదర జీవో ను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి. అయితే దేవుడు వరమిచ్చిన పూజారి వరము ఇవ్వని చందంగా అధికారులు జీవో ను అమలుచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. జీవో నెంబర్ 36ను, లాభనష్టాలతో సంబంధం లేకుండా పిఎసిఎస్ ఉద్యోగులకు తక్షణమే అమలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వవలెను. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ ప్రధాన కార్యదర్శి గొంప రమణ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మద్దల లోవ రాజు, పి నాగభూషణం, కే శ్రీనివాస్, వై ప్రసాద్, ఎం ఎల్ నాయుడు, సుంకర రవి, రాజన్న శంకర్రావు వీరితో పాటుగా ఎలమంచిలి, నక్కపల్లి ,అచ్యుతాపురం, అడ్డరోడ్డు, పాయకరావుపేట, కోటవురట్ల, పరిధిలో గల అన్ని పిఎసిఎస్ బ్రాంచ్ ఉద్యోగులు పాల్గొనడం జరిగింది

# రాజమహేంద్రవరం కల్తీ పాల మూలాలు

**మరో 3 నుంచి 5 రోజుల్లో పరీక్షల ఫలితాల రాక**

**ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం**

**చెన్నై, ముంబై నుంచి రానున్న ప్రత్యేక మందులు**

**నిలకడగా మిగిలిన వారి ఆరోగ్యం**

**బాధితుల నివాస ప్రాంతాల్లోని స్థానికుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ**

**24 గంటలపాటు అందుబాటులో ఉండేలా వైద్యుల నియామకం**

**పాలలో యూరియా కలిసిన ఆనవాళ్ల సమాచారం లేదు**

**రాష్ట్ర వ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీల కోసం ప్రత్యేక డ్రైవ్**

**వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు వీరపాండియన్, నీలకంఠారెడ్డి వెల్లడి**

రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనకు సంబంధించి ఆసుపత్రిలో ఉన్న వారికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ వెల్లడించారు. పాలలో యూరియా ఆనవాళ్ల గురించి ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఒకవేళ పాలలో యూరియా కలిసినట్లయితే వెంటనే కిడ్నీ ఫెయిల్యూర్, కాలేయం దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. యూరియా కలిసిన పాలను దీర్ఘకాలం సేవిస్తేనే కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్, మూత్రం రాకుండా స్తంభించడంవంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెప్పారని తెలిపారు. ఇథలిన్ గ్లైకాల్ కలిసిన పాలను సేవించిన మూడు, నాలుగు రోజులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కూడా చెప్పారని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త కేసులు మంగళవారం ఏమీ నమోదుకాలేదన్నారు.

మంగళగిరిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఇన్స్టిట్యూటు ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంటు) డైరెక్టర్ నీలకంఠారెడ్డితో కలిసి వీరపాండియన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు రాజమహేంద్రవరంలో జరిగిన ఘటనకు సంబంధించి పాలను శీతలికరణచేసే మిషన్లో కూలెంటుగా ఉపయోగించిన ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయినట్లు పోలీసుల విచారణలో గుర్తించారని చెప్పారు. తాము బాధితుల ఇళ్లల్లో ఉపయోగించగా మిగిలిన పెరుగు, నెయ్యి, వెనిగార్, పాల నమూనాలను 10 వరకు సేకరించి వాటిని పరీక్ష నిమిత్తం హైదరాబాద్, కాకినాడలోని జాతీయ ఆహార భద్రత సంస గుర్తించిన ప్రయోగశాలలకు పంపించామని తెలిపారు విక్రేత విక్రయించిన పాలు దొరకలేదని, అయితే పెరుగు, పన్నీర్, నెయ్యి, మీగడ నమూనాలు సేకరించామన్నారు నీటి ఫలితాలు బుధవారం నుంచి శనివారం మధ్య దశల వారీగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు నీటి ఆధారంగానే పాల కల్తీకి సంబంధించి స్పష్టత వస్తుందని భావిస్తున్నామని తెలిపారు.

### ఏడుగురి పరిస్థితి ఆందోళనకరం

రాజమహేంద్రవరం ఘటనకు సంబంధించి ఇప్పటివరకు నలుగురు మరణించారని తెలిపారు ప్రస్తుతం 15 మంది పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు వీరిలో ముగ్గురు వెంటిలేటర్లు, ఇద్దరు డయాలసిస్, మరో ముగ్గురు వెంటిలేటర్-డయాలసిస్పై ఉన్నారని వీరపాండియన్, నీలకంఠారెడ్డి వివరించారు. మొత్తం ఏడుగురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు చికిత్స పొందుతున్న వారిలో ఐదునెలల పాపతోపాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారని తెలిపారు.

### చెన్నై, ముంబయి నుంచి ప్రత్యేక మందుల రాక

బాధితుల ఆరోగ్య పరిస్థితిని సీనియర్ నెఫ్రాలిజిస్ట్ రవిరాజ్ సూచనల మేరకు కిడ్నీల పనితీరు త్వరగా మెరుగుపడేందుకు వీలుగా ఇక్కడ అందుబాటులో లేని మందులను చెన్నై, ముంబయి నుంచి తెప్పిస్తున్నామని తెలిపారు వీటితో వెంటనే బాధితులకు చికిత్స అందిస్తామని వెల్లడించారు.



ఈ నెల 16న ఇళ్లకు పాల సరఫరా జరిగిందని కొందరిలో ఆలస్యంగా లక్షణాలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు దీనివల్ల 24 గంటలపాటు వైద్యులను సదరు ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. మరో నెల వరకు ఈ చర్యలు కొనసాగుతాయని వెల్లడించారు.

### రక్త పరీక్షల ఫలితాలకు అనుగుణంగా ముగ్గుర్ని ఆసుపత్రుల్లో చేర్పించాం

రక్త పరీక్షల ద్వారా క్రియాటిన్ స్థాయి ఎక్కువగా ఉన్న వారిలో ఇద్దరిని గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించామని అధికారులు వివరించారు. వ్యాపారి దగ్గర పాలు కొనుగోలుచేసి, 110 కుటుంబాలకు చెందిన 315 మంది రక్తనమూనాలు సేకరించామన్నారు వీరిలో ఇద్దరికి క్రియాటినిన్ సాయి ఎక్కువగా ఉండడం, మరొకరిలో అనుమానిత లక్షణాలు కనిపించడంతో ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రుల్లో చేర్పించామన్నారు. వీరి ఆరోగ్య పరిస్తితి నిలకడగా ఉందని వెల్లడించారు.

### కొనసాగుతున్న పోలీసుల విచారణ

రాజమహేంద్రవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులో ఉన్న వ్యక్తి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం డెయిరీ పాల నిల్వల విషయంలో కూలెంటుగా వాడిన ఇథలిన్ గ్లైకాల్, ఇతర అంశాల గురించి విచారణ సాగుతుందని పేర్కొన్నారు. పాల శీతలీకరణ యంత్రానికి మరమ్మతులు చేసిన మెకానిక్ను సైతం పోలీసులు విచారించారని, అది మరమ్మతుకు గురైతే తాను సరిచేశానని తెలిపారు. పోలీసులు ఇంకా తీవ్ర స్థాయిలో విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు.

### పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు

రాష్ట్ర వ్యాప్తంగా పాల వర్తకులు, పాల తయారీదారులు, నిల్వదారులు, హోల్సేల్ వర్తకుల నుంచి నమూనాల సేకరణ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఐపీఎం డైరెక్టర్

## అభివృద్ధికి బలమైన పునాది - ఖచ్చితమైన జనగణన గణాంకాలు

**పారదర్శకంగా, సమగ్రంగా డేటా సేకరణ చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




నంద్యాల(ప్రశ్న న్యూస్)దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలు బలమైన పునాది వంటివని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్టలో ఉన్న ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజిలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలు బలమైన పునాది వంటివని ఖచ్చితమైన, సమగ్రమైన మరియు పారదర్శక సమాచార సేకరణ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రతి అధికారి అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, ఇంటింటి సమాచారాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. సేకరించిన గణాంకాల ఆధారంగానే విద్య, వైద్యం, ఉపాధి, గృహనిర్మాణం మరియు మౌలిక వసతుల ప్రణాళికలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. కాబట్టి ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా పని చేయాలని సూచించారు.శిక్షణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ & చీఫ్ ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ డా. జగన్నాథ్ మజ్జి, డిప్యూటీ డైరెక్టర్ & డిప్యూటీ చీఫ్ ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ దిబ్బకర్ బరిహ, జిల్లా ఇన్చార్జి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ జి. విష్ణుమాధురి, డైరెక్టరేట్ శిక్షకులు మోహన్ రమణ, అమిత్ సింగ్, దీపక్ భరద్వాజ్, డిఆర్ఓ రామునాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీఓలు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## వైసీపీ హయంలో 43,948 మంది అనర్హులకు ఇళ్ల పట్టాలు

**: రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్**

**పరిశీలనలో ఇంకా 1,11,037 మంది లబ్ధిదారులు**

**పేదలకు ఇళ్ల పేరుతో దోచుకున్న జగన్ సర్కార్**

**అందరికీ ఇళ్లు పథకం కింద కొత్తగా 4,08,876 దరఖాస్తుల రాక**

**: రెవెన్యూ మంత్రి అనగాని**



అమరావతి(ప్రశ్న న్యూస్) వైసీపీ పాలనా కాలంలో పేదలందరికీ ఇళు పేరుతో 6 వేల కోట్ల రూపాయాల కుంభకోణాలకు పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గత ప్రభుత్వం 22 లక్షల మంది ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 7 లక్షల మంది కన్వేయన్స్ డీడ్లే తీసుకోలేదన్నారు. ఇళ్ల పట్టాల కోసం నివాస యోగ్యం కాని పల్లపు భూములు, శశ్మానాలు, ఊరికి దూరంగా ఉండే భూములు, వర్షాలకు మునిగి పోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక రేట్లు ఇచ్చి సేకరించరాని చెప్పారు. ఇళ్ల పట్టాలు నివాసయోగ్యంగా లేని కారణంగా రెండున్నర లక్షల మంది ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు నిరాకరించారని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని, తమ ప్రభుత్వం విచారణ చేయించగా 43,948 మంది అనర్హులు తేలినట్లు చెప్పారు. పరిశీలనలో ఇంకా 1,11,037 లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ ఇళ్లు పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అయితే గత ప్రభుత్వం సెంటున్నర, సెంటు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మొత్తం 4,08,876 దరఖాస్తులు ఇళ్ల పట్టాల కోసం వచ్చాయని, ఇందులో 1,03,494 దరఖాస్తులను అమోదించగా 1,41,928 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఇంకా 1,56,454 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు.

## ప్లాన్ కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు: కమిషనర్ మయూర్ అశోక్



గుంటూరు (ప్రశ్న న్యూస్)నగరపాలక సంస్థ నుండి పొందిన నిర్దేశిత ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలని, ప్లాన్ లేకుండా లేదా ప్లాన్ కి భిన్నంగా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. మంగళవారం శ్యామల నగర్, ఇన్నర్ రింగ్ రోడ్, టీచర్స్ కాలనీల్లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన భవనాలను పరిశీలించి, ఇన్నర్ రింగ్ రోడ్ లో ఒక భవనం ప్లాన్ కి భిన్నంగా సెల్లార్ లో అదనపు రూమ్ ఏర్పాటుపై సంబందిత టిపిఓకి షోకాజ్ జారీ చేయాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వార్డ్ ల వారీగా నిర్మాణ సమయంలోనే జిఎంసి నుండి తీసుకున్న ప్లాన్ కి అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా ప్లానింగ్ కార్యదర్శులు, టిపీఓలు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆక్యుపెన్సీ, మార్ట్ గేజ్ మంజూరు ఫైల్స్ తమకు పంపే ముందే సిటి ప్లానర్ తరువుగా క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో గ్రీనరీకి కేటాయింపు సరిగా ఉండడం లేదని, సెట్ బ్యాక్ లో కూడా ట్రాన్స్ ఫారాలు, జనరేటర్లు ఉంటున్నట్లు గుర్తించామని, వాటిని తొలగిస్తేనే తదుపరి అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. శ్యామల నగర్ లో ఆక్యుపెన్సీకి దరఖాస్తు భవనం ముందు డ్రైన్ శుభ్రం చేయడానికి గ్రిల్స్ ఏర్పాటు బాగుందని, అలాగే ఇతర అపార్ట్మెంట్లకు కూడా ఏర్పాటు చేసుకోవాలని తెలియచేయాలన్నారు.పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, డిసిపీ సూరజ్ కుమార్, ఏసిపీ రెహ్మాన్, ఈఈ విష్ణు, ఎస్ఎస్ లు ప్రసాద్, సాంబయ్య, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, సర్వేయర్లు లక్ష్మి నారాయణ, సుభాని, కార్పొరేటర్ ఈ.వర ప్రసాద్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను పటిష్టంగా నిర్వహించాలి

**భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలి**

**కలెక్టర్ రాజకుమారి గణియా**




నంద్యాల(ప్రశ్న న్యూస్) అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను ఎటువంటి లోపాలు లేకుండా భక్తిశ్రద్ధలతో, పటిష్టంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బ్రహ్మోత్సవాల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, ఆలయ పరిపాలనాధికారి రామానుజన్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 21వ తేదీన ప్రారంభమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 4వ తేదీ వరకు నిర్వహించబడుతున్నాయని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎగువ దిగువ అహోబిలాల్లో జరిగే కళ్యాణోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు.

## దేవుడి దర్శనం ఖరీదు రెండు
# మాసాల పసికందు ప్రాణం

- పసిపాప మృతి ఘటనపై ఆగ్రహం
-నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి ఉరి శిక్ష విధించాలి
- రజక కుటుంబంపై దాడి అమానుషం - ప్రభుత్వం స్పందించాలి
- బీసీ బలహీన వర్గాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి
- దళిత ఐక్య సంఘటన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి : గడల ప్రసాద్



భీంగల్ (ప్రశ్న న్యూస్) నాగర్ కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మృతి చెందడం తీవ్ర విషాదకరమని నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గం దళిత ఐక్య సంఘటన ఇంచార్జి, జాగిర్యాల గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠిన శిక్ష విధించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక కుటుంబం స్వామివారి దర్శనం కోసం ఆలయంలోకి ప్రవేశించగా, గ్రామ సర్పంచ్ సహా కొందరు అగ్రకుల వ్యక్తులు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిలో సభ్య సమాజం తలదించుకునేలా రెండు నెలల పసిపాపను నిర్దాక్షిణ్యంగా తన్నడం వల్ల మృతి చెందిందని పేర్కొన్నారు.ఇంతటి దారుణ ఘటన జరిగినప్పటికీ పోలీసులు నిందితులను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇదే విధంగా కోదాడలో కర్ల రాజేష్ అనే యువకుడి లాకప్ మృతి ఘటనలోనూ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో దళితులు,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలపై దాడులు పెరుగుతున్నాయని, వారికి సరైన రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి నిందితులపై కేసులు నమోదు చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని గడల ప్రసాద్ డిమాండ్ చేశారు.

## రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారులు
# నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**: కలెక్టర్ డా.,ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి (ప్రశ్న న్యూస్ )రైల్వే ప్రాజెక్ట్ పనులు,శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-1,2, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక బద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు,చెన్నై నేషనల్ హైవే పి డి లు, రైల్వే ప్రాజెక్టు అధికారి జె ఈ ప్రభాకర్, సదరన్ రైల్వే ఈ ఈ శేఖర్, ఈ ఈ ఇరిగేషన్ సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, కొల్లాడం, ఇరుగుళం,పెద్దేటిపాకం,రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి - కాట్పడి సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, , రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, శ్రీ సిటీ మేనేజర్ భగవాన్,సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు , సెక్షన్ అధికారులు భాస్కర్, శివప్రసాద్, శిరీష భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చీకటి రహిత వార్డుగా 48వ వార్డుని
# నెలకొల్పడమే గుడ్ మార్నింగ్ గంకల లక్ష్యం

- 48వ వార్డు బాపూజీ నగర్ లో నూతన ఎలక్ట్రికల్ పోల్స్ ను ఏర్పాటు చేయించిన గంకల
- రాంజీ ఎస్టేట్ లో నూతన ఎలక్ట్రికల్ పోల్ ఏర్పాటు
- కొండ ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటుపై ఫలించిన గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి
- పగలు రాత్రి తేడా లేకుండా వార్డు అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న గంకల కవిత అప్పారావు యాదవ్



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్, నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు పలుమార్లు వినతులు చేశారు.గంకల కవిత అప్పారావు యాదవ్ పిర్యాదుపై అధికారులు స్పందించి సోమవారం వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా 48వ వార్డునకు రూ.16.5 లక్షలతో నూతన రింగ్ పోల్స్,6 మీటర్ల పోల్స్ 35,45 వీధి దీపాలు కేటాయించినట్లు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు.ఇందులో భాగంగా వార్డులో గల బాపూజీ నగర్,రామకృష్ణ నగర్,నీలకంఠ నగర్ లో ఏ ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్ అవసరం ఉన్నది అనేది అధికారులతో కలిసి గంకల కవిత అప్పారావు యాదవ్ పర్యటించి పలు చోట్ల పోల్స్ ఏర్పాటు చేశారు.పగలు, రాత్రి తేడా లేకుండా ఉదయం నుంచి కార్మికులతో కలిసి మధ్యాహ్నం భోజనం విరామం లేకుండా కార్మికులతో రాత్రి వరకు ఉండి వార్డులో నూతన పోల్స్,లైట్స్ ఏర్పాటుకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48 వ వార్డు అంతా కొండ ప్రాంతం కావడంతో చీకటి ప్రదేశం నెలకొంటుందని,ఈ చీకటి ప్రదేశంలో ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయని, నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయని పలుమార్లు కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు వార్డులో నూతన రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని వినతి అందజేయడం జరిగిందని, ఇదే విషయంపై జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించడం జరిగిందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డులో రింగ్ పోల్స్ అవశ్యకత ఉందని ప్రజల ద్వారా తెలుసుకొని గత నాలుగు ఏళ్లగా పోరాటం చేశామని ఈ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు.పలు మార్లు అందించిన వినతులపై జీవీఎంసీ కమిషనర్,మేయర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు స్పందించి వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ కేటాయించడం జరిగిందని,వాటిని బాపూజీ నగర్,రామకృష్ణ నగర్,నీలకంఠ నగర్ లో పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.త్వరలో మరి కొన్ని చోట్ల హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేసి వార్డు అంతట విద్యుత్ దీపాల వెలుగులను కురిపిస్తామన్నారు. వార్డులో అధికారులతో కలిసి పర్యటించి పలు సూచనలు ఇచ్చినట్లు గంకల పేర్కొన్నారు. అతి త్వరలో వార్డులో మరిన్ని వీధి దీపాలు,సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని గంకల హామీ ఇచ్చారు.ప్రతి క్షణం వార్డు అభివృద్ధి కోసమే కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.48వ వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు పట్ల గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి ఫలించిందని, వార్డులో గంకల కవిత అప్పారావు యాదవ్ కృషితో నూతన వెలుగులు వెలగడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ సూచించారు.

## హరిత వేద విద్యాలయంలో
# ఆధ్యాత్మిక శిక్షణకు శ్రీకారం

- భక్తి -జ్ఞానం -ఉపాధి లక్ష్యంగా వేద శిక్షణా తరగతులు
- అమ్మ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు : గడ్డం శ్రీనివాస్ -తిరుమల



తంగళ్లపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్ళపల్లి మండలం, ఓబులాపూర్ గ్రామంలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్ - తిరుమల హరిత వేద విద్యాలయం పేరిట జ్యోతిష్య,పురోహిత శిక్షణా సంస్థను నెలకొల్పి ఔత్సాహిక యువకులను ఆధ్యాత్మిక, ఉపాధి అవకాశాల కల్పనా దిశగా స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం పాల్గుణ శుద్ధ నవమి సందర్భంగా నేడు బుధవారం (25-02-2026) ఉదయం 9.00 నుండి 9.12 గంటల మధ్య శుభ రోహిణి నక్షత్ర యుక్తంగా గృహారంభ ముహూర్తం నిర్వహించనున్నట్లు హరిత వేద విద్యాలయ జ్యోతిష్య, పురోహిత శిక్షణ సంస్థ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేద అధ్యాపకులు, అనుభవజ్ఞులైన జ్యోతిష్య గురువుల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత వేదవిద్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సామాజిక సమానత్వ ధర్మం క్షేత్రంగా నిత్యాగ్ని హోమాలు నిర్వహిస్తూ భక్తి, జ్ఞానం, ఉపాధి లక్ష్యాలతో యువతకు ఆధ్యాత్మిక - ఉపాధి దిశగా మార్గనిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి భక్తులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆశీర్వదించాలని నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్ -తిరుమల విజ్ఞప్తి చేశారు.

# అనుమతుల్లేకుండా మట్టి తరలింపు

- జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్ - బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయినిపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

## రామవరం ప్రజలకు
# తక్షణం మంచినీటి సరఫరా చేయాలి

**కాంగ్రెస్ నాయకుడు మోరే రమేష్ కుమార్ డిమాండ్**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోరే రమేష్ కుమార్ ఆరోపించారు. గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వ నిధులు మిషన్ భగీరథ పథకం కింద దాదాపు రూ.3 కోట్లతో, అలాగే కేంద్ర ప్రభుత్వ జల్ యోజన పథకం కింద రూ.8 కోట్ల వ్యయంతో ఎనిమిది లక్షల లీటర్ల సామర్థ్యం గల భారీ వాటర్ ట్యాంక్ నిర్మించినప్పటికీ, ఇప్పటివరకు అది ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి 28 నెలలు గడిచినప్పటికీ రామవరం పరిధిలోని దాదాపు ఆరు డివిజన్ల ప్రజలకు సరైన మంచినీటి సౌకర్యం లేకపోవడం విచారకరమని అన్నారు. ముఖ్యంగా వేసవికాలం ప్రారంభమైన ఈ సమయంలో కూడా పూర్తయిన వాటర్ ట్యాంకులను ప్రారంభించకుండా పైపులైన్ల మరమ్మత్తు పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రామవరం ప్రజలు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి పూర్తయిన వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో రామవరం ప్రాంత ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని కాంగ్రెస్ పార్టీ తరఫున మోరే రమేష్ కుమార్ హెచ్చరించారు.

## మార్చి 16 నుండి ఏప్రిల్ 01 వరకు జరుగు
# పదవతరగతి పరీక్షలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్




తిరుపతి(ప్రశ్న న్యూస్) మార్చి నెల 16 వ తేదీ నుండి ఏప్రిల్ 01 తేదీ వరకు జరుగనున్న పదవ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 16 నుండి ఏప్రిల్ 01 వ తేది వరకు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు నిర్వహించే పదవతరగతి పరీక్షలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలన్నారుపదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు జిల్లా నుండి పదవ పరీక్షలకు సంబంధించి సుమారు 31334 మంది అనగా 29165 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1178 మంది గత సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులు మరియు 991 మంది ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. మొత్తం 179 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే పరీక్షా ప్రశ్నా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ లకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని తెలిపారు. పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ అధికారులు, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు.పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర ఉన్నతాధికారులతో సహా ఏ ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లరాదన్నారు. పోలీసులు ముందుగా తనిఖీ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డి ఈ ఓ కుమార్,విద్యా శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి బి సుధా, తిరుపతి మునిసిపల్ అడిషనల్ కమీషనర్ శారదా దేవి,డి పి ఓ సుశీలా దేవి, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, రవాణా శాఖ అధికారి మురళీమోహన్, ట్రెజరి అధికారి మృదుల, ఏ పి ఎస్ ఆర్ టి సి సి టి ఎమ్ విశ్వనాథ్, ఏ పి ఎస్ పి డి సి ఎల్ అధికారి, పోలీస్ శాఖ వారు సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్యకు నగర కాంగ్రెస్ అధ్యక్షులు.

**శిక్షణలో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల డి సి సి అధ్యక్షులు**



వికారాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణలో జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాలలో ఇటీవల నియమితులైన నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి ) అధ్యక్షులు, శిక్షణ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా వెళ్చల్ గ్రామంలో క్షేత్ర పర్యటన చేసి అక్కడ స్థానిక ప్రజల, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆయా ప్రాంతాల్లో నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. బీడీ కార్మికుల సమస్యలు, పట్టణ సమస్యలపై దృష్టి సారిస్తూ, ప్రజల విజ్ఞప్తులను స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తరపున సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షుల శిక్షణలో వారిని ప్రోత్సాహ పరిచేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపిసిసి చీఫ్ వై ఎస్ షర్మిలరెడ్డి, ఇంకా ఏఐసీసీ నాయకులు పాల్గొని వారి సందేశాలతో వివిధ శిక్షణ తరగతులు నిర్వహించి ప్రోత్సహించిన విషయం విదితమే.

### విశాఖ నుండి పాల్గొన్న డిసిసి. హాసిని వర్మ

ఈ పర్యటనలో విశాఖ నుండి నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్డాల వర్మ రాజు చురుకుగా పాల్గొంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని వారి విజ్ఞప్తులను ఓపికతో వింటూ స్తానిక రైతు సమస్యలు, వారు పడుతున్న ఇబ్బందులు వారికి కావలసిన అవసరాల వినతులను స్వీకరిస్తూ ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు..రాబోయే రోజుల్లో ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని నూతనంగా నియమితులైన అధ్యక్షులు తద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ప్రజలకు న్యాయం జరిగేలా చూసే అవకాశం కలుగుతుందని,అంతే కాకుండా ఇదే ఉత్సాహంతో అందరం కలసి కట్టుగా పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీని ఆంధ్ర రాష్ట్రంలో నిలబెట్టి రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేయడానికి ఇది మంచి తరుణమని హాసిని వర్మ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన సదస్సు

- మోడల్ స్కూల్ / కళాశాల విద్యార్థినిలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై అవగాహన



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) మహిళల భద్రత, బాలికల రక్షణపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా షీ టీమ్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు విద్యాసంస్థలు, కార్యాలయాలు, మహిళలు అధికంగా పని చేసే ప్రదేశాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్‌లో షీ టీమ్ బృందం విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించింది. గుడ్ టచ్--బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం,మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై వివరించారు.ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా 87126 56425 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. నిందితులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అలాగే సోషల్ మీడియాలో అపరిచితులతో చాటింగ్ చేయకూడదని, వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడం ప్రమాదకరమని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, సిబ్బంది వీరయ్య, శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రఘునాథ్,పాఠశాల ఉపాధ్యాయులు,అధ్యాపకులు హాజరయ్యారు.

# అక్రమ నిర్మాణం సీజ్

**అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తే సీజ్ తప్పదు: డిప్యూటీ కమిషనర్ అంజనేయులు**






ప్రజాప్రశ్న

అడ్డగుట్టలో అక్రమ నిర్మాణాల జోరు




తార్నాక (ప్రశ్న న్యూస్) మెట్టుగూడ సర్కిల్ పరిధిలోని అడ్డగుట్ట డివిజన్ నందు రహదారిపై రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని 4 అంతస్తులు అక్రమంగా నిర్మించారు. దీనిపై స్థానికుల నుండి అనేక ఫిర్యాదులు రావడంతో పాటు పలు పత్రికలలో కథనాలు రావడంతో అధికారులు ఇప్పుడు మేల్కొని అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. నిర్మాణ సమయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు భారీగా లంచాలు తీసుకొని సహకరించారని నిర్మాణం పూర్తి అయిన తర్వాత తిరిగి సీజ్ చేయడం ఎంతవరకు సమంజసం అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలోనే అడ్డుకోకుండా లంచాలు తీసుకొని మౌనంగా ఉండడంతో పాటు వాళ్లకు పూర్తిగా సహకరిస్తున్నారని జిహెచ్ఎంసి పరిధిలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారుల అవినీతి దందా జోరుగా సాగుతోందని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైన అక్రమ నిర్మాణాలపై నిర్మాణ దశ నుండి కఠినంగా వ్యాకరించాలని కోరుతున్నారు. ఇదే విధంగా సీజ్ చేసిన భవనాలు వారం రోజులలో సీజ్ పట్టీలను ఫ్లెక్సీని తొలగించి రాజకీయ నాయకుల అండదండలతో తిరిగి ప్రారంభం అవుతున్నాయని అందులో అధికారులకు కావలసిన మామూళ్ళు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

## బలహీన వర్గాలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- పసిపాప మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లాధ్యక్షులు : గజ్జెల లక్ష్మణ్ మాదిగ



కరీంనగర్ /చొప్పదండి (ప్రశ్న న్యూస్) నాగర్ కర్నూల్ జిల్లా,కుమ్మెర గ్రామంలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మృతి చెందడం అమానుషమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల లక్ష్మణ్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష విధించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో దళితులు, బలహీన వర్గాలపై దాడులు పెరుగుతున్నాయని, వారికి రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి నిందితులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వేములవాడ రాజన్నాలయానికి రూ.695 కోట్లతో మహా ప్రణాళిక

- వేములవాడ ఆలయానికి సమగ్ర అభివృద్ధి రూపకల్పన
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి కొండా సురేఖ ఆదేశాలు
- శ్రీశైలం తరహాలో శివ స్తోత్రాల మ్యూజిక్ ఏర్పాటు సూచన
- రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ కు శ్రీకారం



వేములవాడ.(ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి పనుల పురోగతిని ఆమె సమీక్షించారు.దేవస్థానం విస్తరణకు నాలుగు దశల్లో రూ.695 కోట్ల వ్యయంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. తొలి దశలో రూ.111.25 కోట్ల పనులు కొనసాగుతున్నాయని, వాటిని 2027 మార్చి 31లోపు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలానికి ముందే భవనాల రూఫ్ లెవల్ పనులు ముగించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని,మౌళిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రులు పేర్కొన్నారు. ఒకేసారి 500 మంది కూర్చునే సామర్థ్యంతో నిత్య కళ్యాణ మండపం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మహా మండపం రాఫ్ట్ పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు.నిత్య అన్నదాన సత్రాన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేందుకు రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి విరాళంగా మంత్రి కొండా సురేఖ రూ.25 లక్షలు ప్రకటించారు. దీనికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.భక్తుల సౌకర్యాల పరంగా చిన్నపిల్లలతో వచ్చే తల్లుల కోసం ప్రత్యేక ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, శుభ్రమైన టాయిలెట్లు నిర్మించాలని సూచించారు. ఆలయంలో కోడెల సంరక్షణకు వెటర్నరీ వైద్యుడిని నియమించి, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాడిన పూలతో అగరబత్తీలు తయారు చేసి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే శ్రీశైలం దేవస్థానం తరహాలో శివ స్తోత్రాలతో మ్యూజిక్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి ఎంపీ ఈటలకు ఆహ్వానం



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ దాక్షాయణి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కు దేవాలయ చైర్మన్ ధాత్రిక రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగే కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, నరసింహ రెడ్డి, మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజహరినాథ్, మేడ్చల్ పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్, మైసరి రాజు వంజరి, ధాత్రిక లక్ష్మణ్ వంజరి, మేడ్చల్ మాజీ ఎంపీటీసీ బాలమల్లేష్, కానుకంటి వంశీ విజయ్ వంజరి, మోనార్క్, సాకరబోయిన వెంకటేష్ ముదిరాజ్, మామిళ్ళ నర్సింగ్ రజక తదితరులు పాల్గొన్నారు.

# డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ గా మారిన తెలంగాణ వైద్య విధాన పరిషత్

- డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తూ కేబినెట్ కీలక నిర్ణయం
- సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా హాస్పిటళ్లలో మరింత మెరుగవనున్న వైద్య సేవలు
- నెరవేరుతున్న ఉద్యోగుల చిరకాల వాంఛ - ఉద్యోగుల్లో వెళ్ళివిరిసిన ఆనందం





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ హాస్పిటళ్లలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను (టీవివిపి) డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా (డిఎస్‌ఎచ్) మార్చాలనే నిర్ణయం మేరకు గత సోమవారం నాడు డాక్టర్ బి అర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ డీఎస్‌హెచ్ బిల్లుకు ఆమోదం తెలిపింది. దీంతో ఇన్నాళ్లు స్వయంప్రతిపత్తి (అటానమస్) వ్యవస్థగా ఉన్న తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కు ప్రభుత్వ విభాగం హోదా లభించనుంది.1986లో అటానమస్ బాడీగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌గా మారింది. అప్పటి నుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లు కలిపి మొత్తంగా 184 హాస్పిటళ్లు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, టీచింగ్ హాస్పిటళ్లకు మధ్య వారధిగా టివివిపి ఈ హాస్పిటళ్లలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తోంది. అయితే,తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పూర్తిస్థాయిలో ప్రభుత్వశాఖ కాకపోవడంతో, బడ్జెట్ కేటాయింపులు, వేతనాల చెల్లింపు, తదితర అంశాల్లో జాప్యం జరుగుతోంది. దీంతో దీర్ఘకాలంగా టీవీవీపీ ఉద్యోగులు డైరెక్టరేట్ హోదా కల్పించాలని కోరుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత పక్కా రాష్ట్రం ఏపీలో టివివిపిని సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చారు. దీంతో తెలంగాణలోను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ గా మార్చాలన్న డిమాండ్ పెరిగింది. వేతనాలు ఆలస్యంగా వస్తుండడం, ఈహెచ్ఎస్ వంటి బెనిఫిట్స్ లేకపోవడంతో టివీవీపీ పరిధిలోని హాస్పిటళ్లలో పనిచేసేందుకు డాక్టర్లు కూడా ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో అటు ఉద్యోగుల డిమాండ్ నెరవేర్చడంతో పాటు, ఇటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు టీవీవీపిని డీఎస్‌హెచ్‌గా మార్చాల్సిన అవసరాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గుర్తించి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా నిపుణులతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేయించి పూర్తి వివరాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ గా మార్చాల్సిన అవసరాన్ని క్లుప్తంగా వివరించడంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగుల కల ఫలించింది. ఏ నేపథ్యంలో డైరెక్టరేట్ అఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్, కన్వీనర్ సత్యనారాయణరెడ్డి, ఫౌండర్ కన్వీనర్ సోమ మల్లన్న, కో చైర్మన్లు కో కన్వీనర్లు ఆదిలక్ష్మి, శైలజ, క్రిస్టఫర్, మరియమ్మ, పాండు, పరబ్ కుమార్, సునీత, శాంతిలక్ష్మి, విజిత, వీరమ్మ, భాగ్య, శ్రీనివాసమూర్తి, మధుసూదన్ రెడ్డి, అమృతరావు, బైరంపాక శ్రీనివాస్ బాలునాయక్, భాస్కర్, శ్రీదేవి, శివకుమార్, కరుణాకర్, భరత్ రెడ్డి జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## పసికందు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

**మాజీ వార్డ్ సభ్యులు కుతాడి నరేందర్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)నాగర్ కర్నూల్ లో జరిగినటువంటి రెండు నెలల పసికందు చాకలి మౌనికను అత్యంత దారుణంగా కాలితో తన్ని హత్య చేసిన నిందుతులను వెంటనే అరెస్ట్ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని మునీరాబాద్ గ్రామ మాజీ వార్డు సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆ పేద కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రెండు ఎకరాల భూమి, ఆర్థిక సహాయం చేసి రానున్న రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ ప్రభుత్వం కఠినమైన చట్టాలను తేవాలని కుతాడి నరేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గ్రామపంచాయతీ కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

**- కడారి రాములు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ గ్రామం చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా ఆగిపోయిన వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న కార్మికులు వేతనాల లేమితో ఇబ్బందులు పడుతున్నారని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రతినెలా సమయానికి జీతాలు ఇవ్వాలని కోరారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఈఎస్ఐ,పీఎఫ్,హెల్త్ కార్డులు, రూ. 25 లక్షల ప్రమాద భీమా, రిటైర్మెంట్ తర్వాత సగం వేతనం వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దుంద్రపల్లి రవీందర్,గుడికందుల రమేష్, అల్గొండ ఎల్లయ్య, కురుమ గున్నయ్య,దుంద్రపల్లి లక్ష్మీనారాయణ, కంసాని రాయనర్సు, కంసాని నాగరాజు, ఈసరి దేవయ్య, చిట్యాల రాజయ్య, కోరేపు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన యాదాద్రీశుడు



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కనులవిందుగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ఉదయం రాత్రి స్వామి అమ్మవార్లను వివిధ రకాల పుష్పలతో అలంకరించి వాహన సేవలపై ఊరేగిస్తున్నారు. ఏడవరోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు జగన్మోహిని అవతారంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు, లోక కళ్యాణంకోసం ఈ జగత్ ను కాపాడడానికి స్వామివారు జగన్మోహినిగా అవతరించి సమస్త ప్రజానీకానికి కీడు తలపెట్టే వారిని అంతమొందించేందుకు ఈ భువిపై జగన్మోహిని అవతారం దాల్చాడని ప్రధాన అర్చకుడు సెలవిచ్చారు. జగన్మోహిని అవతారంలో



స్వామివారిని వజ్రవైడూర్యాలు, వివిధ రకాల పుష్పాలతో నయనమనోహరంగా అలంకరించారు అర్చకులు, వేద పండితులు వేదమంత్రాలు, వేదపారాయణ లు మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారుస్వామి వారి సేవ వద్ద అర్చకులు జగన్మోహిని అవతార విశిష్టతను తెలియజేశారు.

# మూగజీవాల పట్ల దాతృత్వం చాటుకున్న మెదక్ డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా కేంద్రంలో ఉదయం స్టేడియం వద్ద క్రికెట్ ప్రాక్టీస్ నెట్ నందు దురదృష్టవశాత్తు చిక్కుకొని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అడవి కుందేలు పిల్లను ఉదయం వాకింగ్ లో భాగంగా అటుగా నడిచి వెళ్తున్న డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మెదక్ పశువర్ధక శాఖ డాక్టర్, ఎండి కాజా సలావిద్దీన్, ఏపీఆర్ఓ బాబు, గమనించడం జరిగింది .వెంటనే స్పందించిన డి పి ఆర్ ఓ చలించిన హృదయంతో మానవీయ కోణంలో వెంటనే దానిని రక్షించి మెదక్ పశువర్ధక డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా చికిత్స అందించడం జరిగింది. ప్రస్తుతం అది కోలుకున్నది. ఈ సందర్భంగా డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు మాట్లాడుతూ పశుపక్షాదులు మూగజీవాలు పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని వేసవి తాపాన్ని తట్టుకోలేక తాగునీటి కోసం చెలిమలు, ఇండ్ల వద్ద కుళాయిలు గోలే లు వద్దకు జంతువులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు వాటికి ఎటువంటి హాని తలపెట్టకుండా ఉండాలన్నారు. మూగ జీవాలు పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉంటే ఆ భగవంతుని కరుణాకటాక్షాలు మనకు సిద్ధిస్తాయని ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరు మూగజీవాలను పరిరక్షించాలని చెప్పారు.

# పీఎం శ్రీ హైస్కూల్లో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేసిన

**మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా చేగుంట మండలం చందాయపేట గ్రామంలో ఈరోజు మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్ గ్రామ ప్రజల ఆశీర్వాదంతో పీఎం శ్రీ జిల్లా పరిషత్ హై స్కూల్ లో చిన్న సహాయంగా 85 మంది విద్యార్థులకు ఎగ్జామ్స్ పాడ్స్ ఇవ్వడం జరిగింది మాజీ సర్పంచ్ మాట్లాడుతూ తన గ్రామంలో ప్రతిసారి హై స్కూల్లో ఎగ్జామ్స్ పాడ్స్ అందజేయడం మరియు ఈ సంవత్సరం గూజ పాస్ అయినవారికి 550 మార్కులు పైన వచ్చిన వాళ్లకు 2000 రూపాయలు బహుమతిగా ప్రకటించడం జరిగింది ఈ చిన్న సహాయం విద్యార్థులకు మంచిగా చదవడానికి ప్రోత్సాహం నా వంతు చిన్న సహాయం గ్రామ ప్రజల ఆశీర్వాదంతో ప్రకటించాను. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కిషన్ సార్. విట్టల్ రెడ్డి. నర్సింలు. దామోదర్. గిరిధర్. శ్రీనివాస్. శంకర్. సలీం.రాములు. స్వప్న. సౌజన్య.వీణ. సంతోషిమాత. లక్ష్మణ్. బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

# వంగపల్లి లో మాజీ మంత్రి హరీష్ రావు కు ఘన స్వాగతం



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్)వరంగల్ లో జరిగే కార్యక్రమానికి బయలుదేరిన మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తని నరేష్ రావుకు ఘన స్వాగతం లభించింది. మంగళవారం మండలంలోని వంగపల్లి గ్రామంలో జాతీయ రహదారి వద్ద బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు బాణసంచా కాల్చి, జై కేసీఆర్ , జై జై బీఆర్ఎస్ జై హరీష్ రావు అంటూ నినాదాలు పలికారు. స్వామివారి ప్రసాదాన్ని మాజీ మంత్రి హరీష్ రావుకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య అందజేసి శాలువతో సత్కరించారు ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు కార్యకర్తలతో ముచ్చటించారు వచ్చేది మన ప్రభుత్వమే అందరూ ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు కర్ర వెంకటయ్య బీఆర్ఎస్ టౌన్ యూత్ అధ్యక్షుడు ముక్కెర్ల సతీష్ యాదవ్ యూత్ నాయకుడు ఆకుల గణేష్ ముదిరాజ్ సారాజ్ రాజేష్ యాదవ్ లింగం రాజు యాదవ్ కంసాని స్వామి పెద్ద కందుకూరు సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచులు తోటకూర బీరయ్య ,ఆరె మల్లేష్, వంగపల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్

**సెక్షన్ 163 దీచీూా (144 సెక్షన్) అమలు**

**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్ 163 దీచీూా (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లా పరిధిలోని మొత్తం 28 ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో 12,334 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ పరీక్షలు తేది: 25-02-2026 నుండి 18-03-2026 వరకు, ప్రతిరోజూ ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు25-02-2026 నుండి 18-03-2026 వరకు,ప్రతిరోజూ ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులకు సూచనలు:పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు పరీక్ష సమయానికి కనీసం అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రశ్నాపత్రాల రవాణాకు ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి, ఎలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన వైద్య ఉద్యోగుల బృందం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసిన వైద్య బృందం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, కేంద్రంలో తెలంగాణ వైద్య, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం (హెచ్-1) అఫ్లికేటెడ్ ఐ.ఎన్.టి.యు.సి.ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కర్నేటి సాయి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎం.డి అజీజ్, ప్రధాన కార్యదర్శిగా తోట రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా జనార్ధన్, కోశాధికారిగా వెంకటరమణ, లీగల్ అడ్వైజర్గా అబూజార్ అహ్మద్ ఖాన్ ఎంపికయ్యారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షులు, వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది రషీద్, రవి, లక్ష్మి, జ్యోతి, శ్రీధర్, రవీందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అఫ్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సేవా హక్కుల పరిరక్షణ, విభాగ అభివృద్ధి కోసం కృషి చేస్తామని వెల్లడించింది.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది



వేములవాడ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై ముఖ్యమంత్రి విప్ ఆది శ్రీనివాస్‌ను అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మద్దతు తెలపడం ఈ విజయానికి కారణమని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అదేవిధంగా వేములవాడ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని ఆది శ్రీనివాస్ కోరారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం



నాచారం(ప్రశ్న న్యూస్) అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం అని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు ఆకర్షితులై నాచారం డివిజన్ లో సుమారు వంద మంది వరకు కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగిందని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు నాచారం డివిజన్ లో సామాజిక కార్యకర్త భావన గౌడ్ వందమంది తో నాచారం లో పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు రేషన్ కార్డ్,ఉచిత బస్సు,200 యూనిట్ల విద్యుత్ ఇలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తుందని అన్నారు. అదే తరహాలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా అభివృద్ధి కి నేను కూడా భాగస్వామిని అవుతానని భావన గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిందని తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించామని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి భావన గౌడ్ సేవలు చాలా అవసరం అన్నారు. గత బి అర్ ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో నాచారం కు ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాలలో 30 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం భావన గౌడ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి డివిజన్ లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారి శ్రీకాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రెడ్డి, కృష్ణారెడ్డి , హెచ్ఆర్ మోహన్, రామ్ రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, ఉప్పల్ బాగాయత్ వైస్ ప్రెసిడెంట్ వకంటి శ్రీనివాస్, మహేష్ యాదవ్, నూతలపాటి రాజు గారు, భద్రయ్య, సత్యనారాయణ యాదవ్, బండారి రఘు, మహమ్మద్ అజ్మత్, రమేష్ గౌడ్, రాజి రెడ్డి, సంతోష్ రెడ్డి, నెమలి సునీల్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, తుంగ తిరుపతి, శేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, అశోక్, కృష్ణ యాదవ్, రాకేష్, రవి యాదవ్, సునీల్ రెడ్డి, సాహిద్, గొల్లం నరేష్, నర్సింగ్ రావు, మహమ్మద్ కుదీస్, మహమ్మద్ అజీమ్, పూర్ణచందర్ రావు, కే. శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ నరేష్, వెంకటేష్ గౌడ్, బాలు యాదవ్, గడ్డం శ్రీనివాస్, గౌడల్లి రాకేష్, శంకర్ గౌడ్, నరేందర్ యాదవ్, మణికంఠ, క్రాంతి కుమార్, సిహెచ్ బాలరాజ్, రేవంత్, అబ్రహం దిలీప్, శ్రీమంతు గౌడ్, మహమ్మద్ జాఫర్, మధు గౌడ్, జూపల్లి రాకేష్, కుమార్, యూసఫ్, మోహన్ చిన్న, ఎం.డి మునీరుద్దీన్, ప్రవీణ్ గౌడ్, ఎం.డి బాబా, ఎం.డి రషీద్, వెంకటేష్, చందు నాయక్, కిషోర్ రెడ్డి, శ్రవణ్ గౌడ్, ఎం.డి జావిద్, ఎం.డి నజీమ్, సిరాజు, ఉమా గారు, భారతమ్మ, లీల గారు, సుజాత, రజియా సుల్తానా, పూర్ణిమ, మమత, సుస్మిత, షైనీ బేగం నాచారం కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాదులకు ప్రాధాన్యం

**- వేములవాడ బార్ అసోసియేషన్ కీలక తీర్మానం**

**- వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు : గుడిసె సదానందం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో న్యాయవాదుల సంఘం మహిళా సాధికారతకు ముందడుగు వేసింది. సంఘ కార్యవర్గ సమావేశంలో మహిళా న్యాయవాదులకు నాలుగు ప్రత్యేక పదవులు కేటాయిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. ఈ సందర్భంగా వేములవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ, న్యాయ రంగంలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం సముచితమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సంఘంలో లైబ్రరీ ఇన్‌చార్జ్, మహిళా ప్రతినిధి, సీనియర్ ఈసీ సభ్యురాలు, జూనియర్ ఈసీ సభ్యురాలు పోస్టులను మహిళలకు కేటాయించడం సంఘ చరిత్రలో ప్రత్యేక ఘట్టమని అన్నారు. ఈ నిర్ణయం ద్వారా మహిళా న్యాయవాదుల ప్రతిభ, నాయకత్వ నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని, ఇతర బార్ అసోసియేషన్లకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని సదానందం పేర్కొన్నారు. సంఘ కార్యకలాపాల్లో మహిళల పాత్ర మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కట్కం జనార్ధన్, జాయింట్ సెక్రటరీ సంపత్ గౌడ్, క్రీడల కార్యదర్శి గుజ్జే మనోహర్, ట్రెజరర్ బొజ్జ మహేందర్, మహిళా ప్రతినిధి జక్కుల పద్మ, సీనియర్ కార్యవర్గ సభ్యులు తమ్మిరి అన్నపూర్ణ, గుడిపల్లి మహేష్, కనపర్తి రాజశేఖర్, గంప రమేష్, జూనియర్ కార్యవర్గ సభ్యురాలు బూర సరిత పాల్గొన్నారు. తీర్మానం ఆమోదం పొందడంతో మహిళా న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తూ సంఘ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలి

**- వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు : గుడిసె సదానందం**

**- మహిళా న్యాయవాదిపై దాడి - న్యాయవాదుల నిరసన**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. నిజామాబాద్ జిల్లా,బోధన్ కోర్టులో న్యాయవృత్తి నిర్వహిస్తున్న జి. కళ్యాణిపై ఈనెల 22న జరిగిన దాడిని ఖండిస్తూ వేములవాడ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం ఎదుట చేరుకొని నినాదాలు చేస్తూ తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ మహిళా న్యాయవాదిపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని, న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, పిట్టల మనోహర్, పెంటరాజు, కొడిమ్యాల పురుషోత్తం, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, స్రవంతి, అపర్ణ, నాయిమా నాసారి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కాదు... ఖాళీ వాణి

**- కాప్రా,నాచారం సర్కిళ్లలో కనిపించని ప్రజావాణి - ఉప్పల్ జోన్ పరిధిలో పాలన అస్తవ్యస్థం**
**- ఇందుకే ప్రజావాణి అంటేనే అమ్మో అంటున్న ప్రజలు**











**కాప్రా (ప్రశ్న న్యూస్)** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సమస్యలు వినిపించే వేదికగా ఉండాల్సిన ప్రజావాణి కార్యక్రమం కేవలం పేరుకు మాత్రంగానే మిగిలిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాప్రా, నాచారం సర్కిళ్లలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజలకే కాకుండా అధికార యంత్రాంగానికి కూడా నిరాశ కలిగించేలా సాగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నాచారం సర్కిల్ పరిధిలో..

నాచారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించిన సమయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలకు అధికారులు కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో కార్యక్రమం నిస్సారంగా మారింది.

ప్రజల సమస్యలు వినిపించే వేదిక ఎవరూ లేక ఖాళీగా ఉండటం మున్సిపల్ పరిపాలన తీరుపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. అన్ని విభాగాల అధికారులు ఎందుకు హాజరుకావడం లేదని ఇలా ఉంటే ఇక ప్రజావాణి కార్యక్రమం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

### కాప్రా సర్కిల్ పరిధిలో..

ఇక కాప్రా సర్కిల్‌లో పరిస్థితి మరింత దారుణంగా కనిపించింది. కార్యక్రమానికి కేవలం డిప్యూటీ కమిషనర్ ఒక్కరే హాజరయ్యారని, మిగతా సంబంధిత అధికారులు గైర్హాజరయ్యారని సమాచారం. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం చూపాల్సిన అన్ని విభాగాల అధికారులు కనిపించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి ఎవరు అధికారులు ఉండనప్పుడు ఎవరి సొంత పనుల్లో వారు బిజీగా ఉంటే ప్రజావాణి కార్యక్రమం ఎందుకో మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ కు జోనల్ కమిషనర్ కే తెలియాలి.

### జోనల్ కమిషనర్ పర్యవేక్షణ, నిర్లక్ష్యమే కారణమా.?

ఉప్పల్ జోన్ పరిధిలోని జోనల్ కమిషనర్ పర్యవేక్షణ పూర్తిగా కరువైందని ఇదే అదనుగా అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనిస్థానిక వర్గాల ఆరోపణలు. జోనల్ కమిషనర్ నిర్లక్ష్య ధోరణే ఈ పరిస్థితులకు ప్రధాన కారణమని స్థానికులు అంటున్నారు. సర్కిళ్ల పనితీరుపై పర్యవేక్షణ లోపించడంతో పరిపాలన శిథిలావస్థకు చేరుకుందని విమర్శలు వినిపిస్తున్నాయి. కిందిస్థాయి అధికారులు సిబ్బందిపై అక్రమాలు, అవినీతి, విధుల పట్ల నిర్లక్ష్యం ఆరోపణలు వస్తున్నప్పటికీ జోనల్ కమిషనర్ వాటిపై గట్టి చర్యలు తీసుకునే దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఉప్పల్ జోన్ పరిధిలో పరిపాలన గందరగోళంగా మారిందని, బాధ్యతాయుత పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయని సామాజిక వర్గాలు అంటున్నాయి.

ప్రజావాణి వంటి కార్యక్రమాలు నామమాత్రంగా మారితే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇప్పటికైన ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి, ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించి, ప్రజావాణి కార్యక్రమాన్ని పునరుద్ధరించడంతో పాటు బాధ్యత లేని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలు వినిపించే వేదిక నిజంగా ప్రజలకోసమే పనిచేయాలన్నదే స్థానికుల ఆకాంక్ష దీనిపై ఉన్నత అధికారులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

# మా అవినీతికి అడ్డేది

**- రెండుసార్లు సీజ్ చేసిన తిరిగి నిర్మాణ పనులు - మున్సిపల్ చట్టం, అవినీతి అధికారులకు చుట్టం**
**- ఉన్నత అధికారులు చర్యలు తీసుకోరు, కిందిస్థాయి అధికారులు అక్రమాలు ఆపరు**
**- ఉప్పల్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు**
**- జోనల్ కమిషనర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల విన్నపం**









**కాప్రా (ప్రశ్న న్యూస్)** ఉప్పల్ జోన్ పరిధిలో కాప్రా సర్కిల్ నందు అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి.

పద్మశాలీ టౌన్ షిప్, భావన ఋషి లో అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తు నిర్మాణానికి ఎలాంటి పర్మిషన్లు లేవని కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ విభాగం తుల్జా సింగ్ సిబ్బంది సీజ్ చేసిన విషయం తెలిసిందే.ఈ అక్రమ నిర్మాణానికి నాయకుల , మున్సిపల్ అధికారుల పూర్తి సహాయ సహకారంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతూ నిర్మాణదారునికి మద్దతు తెలుపుతూ అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి తులజాసింగ్ పై జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఒప్పందం ఎంతకు కుదుర్చుకున్నారో ఉన్నత అధికారికే తెలియాలని బహిర్గంగానే ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా అవినీతి అధికారులపై జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి చేస్తున్నారు.

### రెండుసార్లు సీజ్ చేసిన తిరిగి నిర్మాణ పనులు ప్రారంభం..

అధికారులకు నీతి నిజాయితీకి ఛాలెంజ్ విసురుతూ శరవేగంతో పూర్తి చేసుకున్న అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు,ముచ్చటేమిటంటే ఎన్నోసార్లు తూతూ మంత్రంగా మున్సిపల్ సిబ్బంది సీజ్ అనే నాటకం ఆడారు.చర్లపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్నటువంటి భారీ బహుళ అంతస్తు నిర్మాణం కమర్షియల్ షెటర్లు పలుమార్లు సీజ్ అయిన సంగతి మన అందరికీ తెలిసిందే. కానీ ఇక్కడ ఈ అక్రమ నిర్మాణాలకు సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ కనుసైగల్లో సీజ్ చేసిన వాటిని తొలగించి నిర్మాణ పనులు చేపట్టారని, బహిర్గంగా పలుమార్లు ఇట్టి బహులా అంతస్తు నిర్మాణాన్ని సీజ్ చేసినప్పటికీ అక్రమ నిర్మాణదారుడు ఏదేచ్ఛగా తన పనులను చకచక చేసుకుంటూ ఉన్నత అధికారులకే సవాలు విసురుతున్నాడు. బహిరంగానే మేము అధికారులను పూర్తిస్థాయిలో మేనేజ్ చేశామని ప్రజల ముందు చెప్పడం గమనార్హం. స్థానిక ప్రజలు అధికారులు వ్యవస్థ పట్ల పూర్తి విశ్వాసం సన్నగిల్లి పోవడం జరిగిందన దానికి నిలువెత్తు నిదర్శనము ఈ అక్రమ కట్టడం కాదంటారా అని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇన్నిసార్లు సీజ్ అయినప్పటికీ యదేచ్ఛగా నిర్మాణం కొనసాగుతుండడం పట్ల తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### చర్లపల్లి ఈసి నగర్ లో..

చర్లపల్లి ఈసీ కాలనీలోనీ ఆంధ్ర బ్యాంక్ ఎదురుగా ఉన్నటువంటి ప్రధాన రహదారిపై వెలుస్తున్న ఈ అక్రమ కట్టడంపై పలుమార్లు ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ, అనేక పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ కూడా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటోనని స్థానికుల విమర్శలు అస్త్రం సంధిస్తున్నారు. ఇలాంటి అక్రమ సెల్లార్లతో ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, అధికారులు స్పందించకపోవడంలో లోపాయికారి ఒప్పందాలు ఎంత లోతుగా ఉన్నాయో చెప్పనక్కర్లేదు.

### భావన ఋషి పద్మశాలి టౌన్ షిప్ పక్కన రహదారిపై..

దమ్మయగూడ ప్రధాన రహదారి భావన ఋషి పద్మశాలి టౌన్షిప్ ప్రక్కన వెలుస్తున్న భారీ అక్రమ సెల్లార్ నిర్మాణం జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు వహించడం ఏమిటని నిర్మాణదారుడిపై చర్యలేవి.? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలా కాప్రా సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల కన్ను సైదులు భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులు భారీగా లంచాలు తీసుకొని గత అధికారులు సీజ్ చేసిన వాటిని తొలగించి మున్సిపల్ చట్టానికి తూట్లు పడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా స్పందించి చర్యలు తీసుకుంటారు లేక అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ మౌనంగా ఉంటారో వేచి చూడాలి.

## వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలి

**- వైఎస్ షర్మిల డిమాండ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ కల్తీపై జరుగుతున్న చర్చ ఇప్పుడు వైఎస్ కుటుంబాన్ని రచ్చకీడ్చమే కాకుండా, రాజకీయంగా కొత్త మలుపులు తిరుగుతోంది. వైసీపీ చేసిన తప్పులను తన తండ్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆపాదించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు' కూటమి ప్రభుత్వ తీరు ఉందని ఎద్దేవా చేస్తూ, అసెంబ్లీ రికార్డుల నుంచి వైఎస్సార్‌పై చేసిన వ్యాఖ్యలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ హయాంలో ఏడు కొండలను రెండు కొండలు చేయాలని చూశారన్న విమర్శలను షర్మిల గట్టిగా తిప్పికొట్టారు. "జరిగిందంతా తప్పుడు ప్రచారమే. నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబే బురద చల్లారు. వాస్తవానికి ఏడు కొండలు వెంకన్నవేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చి చరిత్ర సృష్టించింది వైఎస్సార్" అని ఆమె గుర్తు చేశారు. తిరుమల క్షేత్రంలో అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడానికి జీవో 746, 747లను తీసుకొచ్చి కఠిన నిబంధనలు అమలు చేసిన ఘనత తన తండ్రిదేనని, లడ్డూకు 2009లో అంతర్జాతీయంగా పేటెంట్ రైట్స్ సాధించింది కూడా ఆయనేనని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను, వైఎస్సార్ సంక్షేమ పాలనను ఒకటిగా చూడవద్దని షర్మిల హితవు పలికారు. "వైసీపీ పాలన దోచుకుతినే పాలన అయితే, వైఎస్సార్ పాలన పేదల సంక్షేమ పాలన. వైసీపీలో అసలు వైఎస్సార్ లేనే లేడు" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజశేఖర్ రెడ్డి ముమ్మాటికీ కాంగ్రెస్ మనిషి అని, కడవరకు కాంగ్రెస్‌లోనే బతికిన ఆయనను వ్యక్తిగతంగా దూషించడం చంద్రబాబుకు భావ్యం కాదన్నారు. వేద పండితుల కోసం 'ఆయుష్మాన్ భవ', దళితుల కోసం 'దళిత గోవిందం' వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న మహానేతను దేవుడిగా కొలుస్తారని అన్నారు.

## 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్

**- 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు.ఈ భారీ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపుదాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 234 డెబిట్/క్రెడిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, 152 బ్యాంకు పాస్‌బుక్‌లు, 56 కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ అరవింద్ బాబు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతమైందని కమిషనర్ ప్రశంసించారు. సైబర్ నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నామని, ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ముఠాలోని ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామని, సైబర్ నేరగాళ్లకు సహకరించే బ్యాంకు అధికారులు, మ్యూల్ ఖాతాదారులతో సహా ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

## ఆక్రమణకు గురవుతున్న గిరిజన కాలనీ




ఓజిలి (ప్రశ్న న్యూస్) ఓజిలి మండలంలోని కర్ర బల్లవలు గిరిజన కాలనీలో కొందరు బయట వ్యక్తులు భూములు ఆక్రమించి ఫెన్సింగ్ వేస్తున్నారని గ్రామస్తులు మంగళవారం నాడు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. తమ గ్రామాన్ని డీఐజీ గోపీనాథ్ జెట్టి దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తుంటే, కొందరు బయట వ్యక్తులు దానిని ఆక్రమిస్తున్నారని ఇకనైనా మండలాధికారులు స్పందించి భూ ఆక్రమణ జరగకుండా చూడాలని గిరిజనులు వేడుకుంటున్నా రు.అమాయక గిరిజనులకు చెందిన భూములను కొందరు బయటి వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి, ఫెన్సింగ్‌లు వేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.తమ గ్రామాన్ని డి.ఐ.జి గోపీనాథ్ జెట్టి దత్తత తీసుకున్నారని, ఆయన చొరవతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని గ్రామస్తులు తెలిపారు. అయితే, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు బయటి వ్యక్తులు కుట్రపూరితంగా తమ భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. రాత్రికి రాత్రే ఫెన్సింగ్‌లు వేసి భూములను స్వాధీనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలోనే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గిరిజనులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.రెవెన్యూ మరియు మండల అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని .గిరిజన భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.తమ జీవనాధారమైన భూములను కాపాడి, తమకు న్యాయం చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు.విఆర్ఓ చంద్రశేఖర్ ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ భూములు స్థలాలు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588